మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 35 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada




## నేడు ఈదుల్ ఫితర్

**- ముస్లిం సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్**



హైదరాబాద్ (ప్రజా మంటలు): రంజాన్ సందర్భంగా రాష్ట్రంలోని ముస్లిం సోదరులందరికీ సీఎం రేవంత్ రెడ్డి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను రాష్ట్రంలోని ముస్లింలందరూ ఆనందంగా జరుపుకొని అల్లా దీవెనలను అందుకోవాలని ఆకాంక్షించారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లింలు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో ఇంటిల్లిపాది మిగతా 2లో..



## డీఎంకే, కాంగ్రెస్‌లవి విద్వేషపు రాజకీయాలు

**- ప్రధాని మోదీ**

చెన్నై (ప్రజా మంటలు): తమిళనాడు అధికార పార్టీ డీఎంకేపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ ఎప్పుడూ ద్వేషపూరిత, విభజన రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని మెట్టుపాలయంలో భాజపా ఏర్పాటుచేసిన ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ఈసందర్భంగా అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపైనా విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. డీఎంకే అహంకారంలో మునిగిపోయిందని మోదీ ఆరోపించారు. ఆ పార్టీ.. 'ఇండియా' కూటమి అజెండా ఒక్కటేనన్నారు. "రాష్ట్ర భాజపా అధ్యక్షుడు అన్నమలై గురించి ప్రశ్నించగా.. డీఎంకే నేత ఒకరు అహంకారంతో మాట్లాడారు. ఆయన అవమానకర వ్యాఖ్యలు తమిళ సంస్కృతికి విరుద్ధం. ఈ దురహంకారానికి ప్రజలు ఎప్పటికీ మద్దతు తెలపరు. డీఎంకే విభజన మిగతా 2లో..

## గెలుపే లక్ష్యంగా పనిచేయండి

**- భువనగిరి నాయకులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**



హైదరాబాద్ (ప్రజా మంటలు): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో జరగగా సిఎం రేవంత్ తదితరులు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ఎన్నికల ప్రచార కార్యక్రమాలపై నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈనెల 21న నామినేషన్ వేయనున్న నేపథ్యంలో అదే రోజు భువనగిరిలో బహిరంగ సభ నిర్వహించాలని సీఎం సూచించారు. మే తొలి వారంలో నిర్వహించే సభకు ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. గెలుపు కోసం ప్రజలను కలిసి నేరుగా ఓట్లు కోరాలని అన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగ ఆముందుకు సాగాలన్నారు. మనం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల ముందు పెట్టాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజగోపాల్‌రెడ్డి, లోక్‌సభ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతోపాటు ముఖ్యనాయకులు హాజరయ్యారు. భువనగిరిలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం నాయకులు , కార్యకర్తలు కృషి చేయాలని సీఎం కోరారు.

## బీజేపీ మరో జాబితా విడుదల..

**- చండీగఢ్ నుంచి అనుపమ్ ఖేర్ సతీమణి ఔట్**




దిల్లీ (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికల నిమిత్తం మరికొన్ని స్థానాలకు భాజపా అభ్యర్థులను ప్రకటించింది. ఈ పదో జాబితాలో తొమ్మిది మంది అభ్యర్థుల పేర్లను విడుదల చేసింది. అసన్ సోల్ నుంచి ఎస్ఎస్ అహ్లూవాలియాను ఎంపిక చేసింది. అలాగే చండీగఢ్ సిట్టింగ్ ఎంపీ కిరణ్ ఖేర్‌ను తప్పించి.. ఆ స్థానంలో సంజయ్ టాండన్‌ను బరిలో నిలిపింది. కిరణ్ ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ సతీమణి. అలాగే మాజీ ప్రధాని చంద్రశేఖర్ కుమారుడు నీరజ్‌కు యూపీలోని బాలియా నుంచి టికెట్ దక్కింది. చండీగఢ్, అసన్‌సోల్‌తో సహా ఆ రాష్ట్రంలోని ఏడుస్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లైంది. తొలుత పశ్చిమ్ బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి పవన్‌సింగ్ పేరును ప్రకటించింది. అయితే ఆయన పాటలు మహిళల్ని అసభ్యకరంగా చిత్రీకరించేలా ఉంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో ఆయనే పోటీ నుంచి వైదొలిగారు.

మైన్‌పురి -జైవీర్ సింగ్ ఠాకూర్
కౌశాంబి - వినోద్ సోంకర్
ఫుల్‌పూర్ - ప్రవీణ్ పటేల్
ప్రయాగ్‌రాజ్- నీరజ్ త్రిపాఠి
మచ్లీషహర్ - బీపీ సరోజ్
గాజీపూర్ - పరాస్ నాథ్ రాయ్

## పతంజలిపై సుప్రీం ఆగ్రహం

- బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణ క్షమాపణలు తిరస్కరణ
- చర్యలకు సిద్ధంగా ఉండండి
- ఘాటుగా హెచ్చరించిన ధర్మాసనం
- కరోనిల్ ప్రచారంపై పతంజలి ఆయుర్వేదంను అప్పట్లోనే హెచ్చరించాం: కేంద్రం

వార్తా 2లో..




### అరెస్టుపై సుప్రీంలో

## కేజ్రీవాల్ సవాల్

- లాయర్లను కలిసేందుకు అదనపు సమయం
- కేజ్రీవాల్ అభ్యర్థనను తోసిపుచ్చిన రౌస్ అవెన్యూ కోర్టు
- కేజ్రీవాల్‌ను తొలగించాలన్న పిటిషన్ కొట్టేసిన దిల్లీ హైకోర్టు
- ఇదేమీ 'జేమ్స్ బాండ్' సినిమా సీక్వెల్‌కాదని ఆగ్రహం

2లో..



## నెతన్యాహు వైఖరి సరికాదు

- గాజా విషయంలో ఆయన తప్పు చేస్తున్నాడు
- వెంటనే కాల్పులు విరమణ అమలు చేయండి
- ఇజ్రాయెల్‌కు బైడెన్ హెచ్చరిక



వాషింగ్టన్ (ప్రజా మంటలు): హమాస్ యుద్ధం మొదలుపెట్టినప్పటి నుంచి ఇజ్రాయెల్ తొలిసారి అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. "నెతన్యాహూ గాజాలో తప్పు చేస్తున్నారు. ఆయన వైఖరిని నేను అంగీకరించను. ఆరు లేదా ఎనిమిది వారాలపాటు తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని నేను ఇజ్రాయెలీలను కోరుతున్నాను. ఈ సమయంలో శరణార్థులకు ఆహారం, ఔషధాలను సరఫరా చేయొచ్చు" అని ఓ టీవీ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో..

## సీబీఐ విచారణపై కవిత పిటిషన్

**- 26కు వాయిదా వేసిన కోర్టు**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సీబీఐ ఇంటరాగేషన్ చేయడాన్ని కవిత తరపు న్యాయవాదులు తప్పుబట్టారు. సీబీఐ ప్రశ్నించడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై ఈనెల 26న సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ జరుగనుంది. ఇప్పటికే కోర్టులో వాదనల సందర్భంగా కవితను తీహార్ జైల్లో విచారించామని కోర్టుకు సీబీఐ తెలిపింది. అయితే పిటిషన్‌పై రిప్లై కాపీ ఇవ్వలేదు. దీనిపై రిప్లై ఇవ్వాల్సిన అవసరం లేదని సీబీఐ తెలిపింది. అటు కవిత తరపున రాణా, మోహిత్ రావు వాదనలు వినిపించారు. సీబీఐ తమకు రిప్లై కాపీ ఇవ్వలేదని కవిత తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సీబీఐ విచారణపై శనివారం సాయంత్రం 5:30 గంటలకు ఆర్డర్ వచ్చిందని తెలిపారు. అయితే కవితను 6వ తేదీన మధ్యాహ్నం 12:30 గంటలకే సీబీఐ విచారించిందని చెప్పారు. ఆర్డర్ రాకుండానే సీబీఐ విచారణ జరిపిందని కవిత తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. ముందుగా మిగతా 2లో..

## టెట్ దరఖాస్తులు 20వరకు పొడిగింపు



హైదరాబాద్ (ప్రజా మంటలు): టీఎస్ టెట్-2024కు దరఖాస్తు చేయలేకపోయిన వారికి తెలంగాణ విద్యాశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. టెట్ అప్లికేషన్ దరఖాస్తు సమర్పణ గడువును ఏప్రిల్ 20 వరకు పొడగిస్తున్నట్టు ప్రకటించింది. ఏప్రిల్ 11 నుంచి 20 వరకు అభ్యర్థులకు ఎడిట్ అప్షన్ ఇస్తున్నట్టుగా పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సర్క్యులర్ జారీ చేశారు.మార్చి 22న ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం ఏప్రిల్ 10 అప్లికేషన్లకు గడువు ముగియాల్సి ఉంది. మార్చి 27న మొదలైన అప్లికేషన్లు బుధవారంతో ముగియాల్సి ఉంది. చివరి రోజున అప్లికేషన్లు కూడా ఎక్కువగా రావొచ్చని అంచనాలు వేశారు. అభ్యర్థి తాకిడి ఎక్కువగా ఉండొచ్చని భావించారు. అయితే గడువు పొడగిస్తున్నట్టు తెలంగాణ విద్యాశాఖ ప్రకటించడంతో ఇప్పటికే ఆలస్యమైన అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. అభ్యర్థులు తెలంగాణ గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా షెడ్యూల్ ప్రకారం మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలు జూన్ 12న వెలువడనున్నాయి.




## లాస్య నందిత సోదరికే కంటోన్మెంట్ టిక్కెట్

**నివేదిత పేరును ఖరారు చేసిన కేసీఆర్**

హైదరాబాద్ (ప్రజా మంటలు): కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సాయన్న మరో తనయ నివేదిత పేరును పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. పార్టీ ముఖ్యులు, స్థానిక నేతలతో చర్చించిన అనంతరం దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదితను అభ్యర్థిగా ప్రకటించినట్లుగా బీఆర్ఎస్ పార్టీ అధికారిక ప్రకటన చేసింది.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో ఆ స్థానంలో ఉప ఎన్నిక వచ్చిన సంగతి తెలిసిందే. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తె నివేదిత. 2023 ఫిబ్రవరిలో సాయన్న కిడ్నీ మిగతా 2లో..

## ప్రజా నాడి




## రాధాకిషన్ రావుకు 12 వరకు రిమాండ్

**- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఒక్కొక్కరుగా బయటకు వస్తున్న బాధితులు**



హైదరాబాద్ (ప్రజా మంటలు): ఫోన్ ట్యాపింగ్ కేసు టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావుకు ఈనెల 12 వరకు నాంపల్లి కోర్టు రిమాండ్ పొడిగించింది. నేటితో రాధాకిషన్ రావు కస్టడీ ముగియడంతో ఆయనను ఉదయం నాంపల్లి కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. దీంతో రాధాకిషన్‌కు ఈ నెల 12 వరకు రిమాండ్ కొనసాగిస్తున్నట్ల కోర్టు తెలిపింది. జైల్‌లో లైబ్రరీకి వెళ్లేందుకు అనుమతించడం లేదని ఈ సందర్భంగా కోర్టుకు రాధా కిషన్ తెలిపారు. జైల్ సూపరింటెండెంట్‌ను కూడా కలవనీయడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులను కోర్టు ప్రశ్నించింది. లైబ్రరీతో పాటు జైలు సూపరింటెండెంట్‌ను కలిసేలా అనుమతిస్తూ కోర్టు ఆదేశించింది. ఇకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు అయిన మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు బాధితులు ఒక్కొక్కరిగా బయటకొస్తున్నారు. 2024 ఏప్రిల్ 4 బుధవారం నాడు టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావు పై మరో కేసు నమోదైంది. క్రియా హెల్త్ కేర్ సంస్థ డైరెక్టర్లతో కలిసి తనపై ఉన్న షేర్లు బలవంతంగా రాయించుకున్నారని చైర్మన్ వేణుమాధవ్ చెన్నుపాటి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. అంతే కాక తనపై ఉన్న యాజమాన్య హక్కులను మిగతా 2లో..

### కాంగ్రెస్‌ను పడగొట్టాల్సిన

## అవసరం మాకు లేదు

- రాముడికి మొక్కుదాం..బిజెపిని తొక్కుదాం
- ఫోన్ ట్యాపింగ్ కాదు..మంచినీళ్లపై దృష్టి పెట్టండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ (ప్రజా మంటలు): రాముడు మాకు కూడా దేవుడే. రాముడికి మొక్కుదాం.. ఓటుతో ఎన్నికల్లో బీజేపీనీ తొక్కుదాం అంటూ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఘట్‌కేసర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నా నన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన ఖర్మ మాకు లేదు అన్నారు కేటీఆర్. ఫోన్ ట్యాపింగ్ మీద పెట్టిన శ్రద్ధ.. మంచినీళ్ల మీద పెట్టమని హితవు పలికారు. రైతు బంధు, దళిత బంధు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్, బతుకమ్మ చీరలు సహా అన్ని రద్దు చేశారని విమర్శించారు. రాహుల్ భారత్ జోడో యాత్ర అని దేశమంతా తిరుగుతుంటే రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ నా పెద్దన్న అంటారని ఎద్దేవా చేశారు. లిక్కర్ స్కామ్ జరగలేదని రాహుల్ అంటే లేదు లిక్కర్ స్కామ్ జరిగిందని రేవంత్ అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో రాహుల్, రేవంత్ రెండు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# పతంజలిపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి రెండోసారి క్షమాపణలు చెప్పడాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది, బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ దాఖలు చేసిన అఫిడవిట్ ను బుధవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. బాబా రామ్‌దేవ్ కోర్టు ధిక్కార చర్యలను తేలికగా తీసుకుంటున్నారని సుప్రీంకోర్టు పేర్కొంది. తమ ఆదేశాలను పదేపదే ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినందుకు క్షమాపణ సరిపోదని.. కోర్టు ధిక్కరణ చర్యలకు సిద్ధంగా ఉండండని హిమా కోహ్లీ, అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. వారి క్షమాపణలను అంగీకరించబోమని, చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. వారివురు సమర్పించిన ప్రమాణ పత్రాలను జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ఈ కేసులో తాము ఉదారంగా వ్యవరించలేమంటూ స్పష్టంచేసింది. పతంజలి ధిక్కరణ కేసులో బుధవారం విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. మీరు కోర్టు పట్ల ఏ విధంగా అయితే అలక్ష్యంగా వ్యవహరించారో.. అలానే మీ క్షమాపణ పట్ల మేమెందుకు వ్యవహరించకూడదు? మీ క్షమాపణ మీద మాకు నమ్మకం లేదు. దాన్ని తిరస్కరిస్తున్నాం అని ధర్మాసనం పేర్కొంది. తమకు క్షమాపణలు చెప్పడానికి ముందే వారు తమ అఫిడవిట్లనను మీడియాకు పంపారు. నిన్న రాత్రి 7.30 గంటల వరకు అవి మాకు అప్‌లోడ్ అవ్వలేదు. దీనిబట్టి ప్రచారం కోరుకుంటున్నారని అర్థం అవుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇది కేవలం ఒక ఎఫ్‌ఎంసీజీ కంపెనీకి సంబంధించిన వ్యవహారం కాదని, న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘిస్తే ఏం జరుగుతుందనే విషయం సమాజంలోకి వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో చర్యలు తీసుకోనందుకు ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీని సైతం మందలించింది. పదే పదే ఉల్లంఘనలు జరుగుతున్నా హెచ్చరించి విడిచిపెట్టడం తప్ప అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు మిన్నకుండిపోయారని ప్రశ్నించింది. లైసెన్సింగ్ అథారిటీలో ఉన్న ముగ్గురు అధికారులను ఇప్పుడే సస్పెండ్ చేయాలని ధర్మాసనం పేర్కొంది. పతంజలి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనం ముందు మాట్లాడుతూ.. జీవితంలో మనుషులు తప్పులు చేస్తుంటారు. అయితే, అటువంటి కేసుల్లో వ్యక్తులు బాధపడాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనికి ప్రతిస్పందించిన అత్యున్నత న్యాయస్థానం న్యాయవాదిని మందలించింది. మేం అంధులు కాదు.. ఈ విషయంలో ఉదారంగా వ్యవహరించాలనుకోవడం లేదు అని ధర్మాసనం బదులిచ్చింది. పతంజలి డయాబెటిస్, ఆస్తమా వంటి వ్యాధులను ఆయుర్వేదిక్ మందులు, యోగాతో పూర్తిగా నయం చేస్తుందని అడ్వటైజింగ్ చేయడాన్ని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ తప్పుబట్టింది. రామ్ దేవ్ బాబా మెడిసిన్ వాడకంపై వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని కోర్టుకు ఫిర్యాదు చేసింది. రామ్‌దేవ్‌పై భారత శిక్షాస్మృతి లోని 188, 269, 504 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతంలో కోవిడ్ -19 వ్యాక్సినేషన్‌కు వ్యతిరేకంగా పతంజలి వ్యవస్థాపకులు రామ్ దేవ్ బాబా క్యాంపెయిన్ నిర్వహించిందని ఆరోపిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పతంజలి ఆయుర్వేదిక్ వ్యాధుల్ని వెంటనే, పూర్తిగా నయం చేస్తుందని చేసిన యాడ్స్ పై సుప్రీం కోర్టు సీరియస్ అయింది. ఇలాంటి ఫాల్స్ ఇన్ఫర్మేషన్ తో యాడ్స్ పబ్లిసిటీ చేసినందుకు పతంజలిపై చర్యలు తీసుకుంటాయని సుప్రీంకోర్టు హెచ్చరించింది.

**కరోనిల్ ప్రచారంపై పతంజలి ఆయుర్వేదను అప్పట్లోనే హెచ్చరించాం: కేంద్రం**

అల్లోపతి ఔషధాల ప్రభావశీలతను తక్కువ చేసినందుకుగానూ పతంజలి ఆయుర్వేద సంస్థ తీరును విమర్శిస్తూ కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. పతంజలి కోర్టు ధిక్కరణ కేసు నేడు విచారణకు రానున్న తరుణంలో ప్రభుత్వం నుంచి ఈ మేరకు స్పందన రావడం గమనార్హం. దేశంలో అందుబాటులో ఉన్న సమగ్ర వైద్యారోగ్య వ్యవస్థలో ఆయుష్ లేదా అల్లోపతి చికిత్సల్లో ఎంపిక చేసుకునే అవకాశం ప్రజలకు ఉందని కేంద్రం తెలిపింది. కొవిడ్-19 మహమ్మారి సమయంలో 'కరోనిల్'ను కరోనా వైరస్‌కు విరుగుడుగా ప్రచారం చేయడంపై పతంజలిని హెచ్చరించినట్లు అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొంది. ఆయుష్ శాఖ నుంచి ఆమోదం



లభించేవరకు అలాంటి ప్రకటనలు ఇవ్వొద్దని ఆదేశించినట్లు తెలిపింది. ఒక ఔషధాన్ని ఆమోదించే ముందు నిర్వహించాల్సిన క్లినికల్ ట్రయల్స్ ప్రక్రియను గుర్తుచేసినట్లు వెల్లడించింది. అందుబాటులో ఉన్న వివిధ రకాల చికిత్సల ప్రాధాన్యాన్ని కేంద్రం నొక్కిచెప్పింది. దేన్నీ తులనాడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పతంజలిపై వచ్చిన అభ్యంతరాలను వెంటనే పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకున్నామని తెలిపింది. ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంది. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న అన్ని చికిత్సల్లోని ప్రయోజనాలను ఉపయోగించుకుంటామని వివరించింది. పతంజలి ఆయుర్వేద ఔషధాలకు సంబంధించి తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో యోగా గురు రాందేవ్, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ బేషరతుగా సుప్రీంకోర్టుకు మంగళవారం క్షమాపణలు తెలిపారు. దీనికిగాను వారిద్దరూ విడివిడిగా అఫిడవిట్లు దాఖలు చేశారు. చట్టం, వాణిజ్య ప్రకటనలు, మార్కెట్ నిబంధనలను ఇకపై ఉల్లంఘించబోమంటూ సర్వోన్నత న్యాయస్థానానికి గత ఏడాది నవంబరు 21న పతంజలి తరఫున వీరు ప్రమాణ పత్రం సమర్పించారు. అయినప్పటికీ ఆ హామీలను పాటించకపోవడంతో సుప్రీంకోర్టు ధర్మాసనం గత వారం వారిద్దరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదంటూ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణ బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ప్రమాణ పత్రం ఉల్లంఘనలపై చిత్తశుద్ధితో విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోసారి ఈ పొరపాటును పునరావృతం కానివ్వబోమని వాగ్దానం చేశారు.

## చిన్న హనుమాన్ జయంతి కి ఏర్పాట్లు

### భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు): చిన్న హనుమాన్ జయంతి కి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి. ఆలయంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పరిశీలించారు.



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు లో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే మహోత్సవలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో, మాలవిరమణ, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట డిఎస్పి రఘు చందర్, మల్యాల సి.ఐ నీలం రవి, ఎస్.ఐ రహీం ఉన్నారు.



కొండగట్టు, దొంగలమర్రి మధ్యలో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లగా, కారు లో ప్రయాణిస్తున్న జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామ కేబుల్ ఆపరేటర్ వేణు, ఆయన కుమారునికి గాయాలు అయ్యాయి.

## నేడు ఈదుల్ ఫితర్

### - ముస్లిం సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని సేవలకు మించి మానవ సేవ అత్యున్నతమైనదని చాటి చెప్పే రంజాన్ పండుగ లౌకిక వాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

## డీఎంకే, కాంగ్రెస్‌లవి విద్వేషపు రాజకీయాలు

### – ప్రధాని మోదీ

రాజకీయాల వైపే మొగ్గు చూపుతోంది. రాష్ట్రాభివృద్ధిపై ధ్యాసే లేదు. ఎన్డీయే ప్రభుత్వం నీలగిరి అభివృద్ధికి మరింత కృషి చేస్తుంది" అని మోదీ హామీ ఇచ్చారు. భాజపా ప్రభుత్వం రాష్ట్రంలో డిఫెన్స్ కారిడార్లను నిర్మిస్తోంది. విభజన మనస్తత్వంతో ఉన్న 'ఇండియా' కూటమి అలా చేయగలదా అని ప్రశ్నించారు. తమిళనాడు అభివృద్ధి కోసం పదేళ్లలో రూ.కోట్ల పెట్టుబడులు పెట్టమన్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రాల మధ్య వివక్ష చూపిందని ఆరోపించారు. కానీ.. ఎన్డీయే ప్రభుత్వం 'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్' విజన్‌తో పనిచేస్తోందన్నారు. కుటుంబ పార్టీలు తమ వారసుల భవిష్యత్తు గురించి తప్ప.. సామాన్యుల గురించి ఆలోచించలేవని విమర్శించారు. పేదరిక నిర్మూలన నినాదమిచ్చిన కాంగ్రెస్ ఎన్ని దశాబ్దాలైనా దాన్ని నిర్మూలించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్డీయే ప్రభుత్వం 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కలిగించిందన్నారు.

## నెతన్యాహు వైఖరి సరికాదు



గత వారం జరిగిన డ్రోన్ దాడిలో అమెరికాకు చెందిన ఎన్జీవో సంస్థలో పనిచేస్తున్న ఏడుగురు మరణించారు. ఈ ఘటనపై అగ్రరాజ్యం తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసింది. జోర్డాన్, సౌదీ, ఈజిప్ట్ దేశాలు కూడా సహాయం, ఆహారం పంపేలా నిత్యం వారితో సంప్రదింపులు జరుపుతున్నట్లు బైడెన్ తెలిపారు. వారు కూడా దీనికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గాజాలోని ప్రజలకు ఔషధాలు, ఆహార సరఫరాలో ఎటువంటి రాజీ ఉండదని చెప్పారు. మరోవైపు శ్వేతసౌధం స్పందిస్తూ సంధి కోసం ఇజ్రాయెల్ కొన్ని చర్యలు తీసుకొందని వెల్లడించింది. కానీ, హమాస్ వైపు స్పందన మాత్రం అంత ప్రోత్సాహకరంగా లేదని పేర్కొంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం దీనిపై స్పందిస్తూ అమెరికా, ఐరాస డిమాండ్ చేసినవిధంగానే గాజాలోకి సరఫరాలను పెంచామని వివరించింది. తాము వీటికి ఎటువంటి ఆటంకాలను సృష్టించడం లేదని తెలిపింది. సోమవారం 468 ట్రక్కులు, మంగళవారం 419 ట్రక్కుల సామగ్రిని తరలించినట్లు చెప్పింది. యుద్ధం మొదలైన నాటికి ఇదే అత్యధికమని వెల్లడించింది.

## సీబీఐ విచారణపై కవిత పిటిషన్

### - 26కు వాయిదా వేసిన కోర్టు

విచారించాలంటే మరోసారి అప్లికేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని జడ్జి సూచించారు. దీంతో 26వ తేదీన వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని సీబీఐ చెప్పింది. ఈ క్రమంలో ఈ కేసు తదుపరి విచారణను కోర్టు ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు వాయిదా వేసింది.

# అరెస్టుపై సుప్రీంలో కేజ్రీవాల్ సవాల్



ఢిల్లీ (ప్రజా మంటలు): మద్యం కుంభకోణంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సమర్థిస్తూ హైకోర్టు వెలువరించిన తీర్పును ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలు చేసినట్లు ఆయన తరఫున న్యాయవాది వివేక్ జైన్ బుధవారం వెల్లడించారు. హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై కూడా పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ నిరాశ ఎదురైన విషయం తెలిసిందే. ఈడీ వద్ద తగిన ఆధారాలున్నాయని.. అందుకే పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. అరెస్టు, రిమాండ్ చట్టవిరుద్ధం కాదని వ్యాఖ్యానించింది. మనీలాండరింగ్‌పై ఈడీ ఆధారాలు చూపించిందని, గోవా ఎన్నికలకు డబ్బు ఇచ్చినట్లు అప్రూవర్ చెప్పారని పేర్కొంది. సీఎంకు ఒక న్యాయం, సామాన్యులకు మరొక న్యాయం ఉండదని తేల్చి చెప్పింది. మద్యం విధానం కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు ఈడీ తమ కస్టడీలోకి తీసుకొని విచారించగా.. ఏప్రిల్ 15 వరకు జ్యుడిషియల్ రిమాండ్‌లో భాగంగా ప్రస్తుతం ఆయన తిహాడ్ జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో తన అరెస్టును సవాల్ చేస్తూ మధ్యంతర ఉపశమనం కల్పించాలని కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం మంగళవారం తీర్పు వెల్లడించింది. అది వ్యతిరేకంగా ఉండటంతో కేజ్రీవాల్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**కేజ్రీవాల్ అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు**

మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తాజాగా మరో ఎదురుదెబ్బ తగిలింది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో తన లాయర్లను కలిసేందుకు అదనపు సమయం ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తిని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు బుధవారం కొట్టివేసింది. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు వారానికి రెండుసార్లు మాత్రమే తన లాయర్లను కలవడానికి అనుమతి ఉంది. అయితే.. వారానికి ఐదుసార్లు కలిసేలా అనుమతి ఇవ్వాలని ఆయన కోర్టుని కోరారు. ఆ విజ్ఞప్తిని న్యాయస్థానం రిజెక్ట్ చేయడంతో.. ఇంతకుముందులా వారానికి రెండుసార్లు మాత్రమే లాయర్లను కలవడానికి వీలుంటుంది. మరోవైపు.. తన అరెస్ట్, రిమాండ్‌ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కేజ్రీవాల్‌కు నిరాశే ఎదురైంది. అరెస్టు, రిమాండ్ చట్టవిరుద్ధం కాదని.. మనీలాండరింగ్‌పై ఈడీ తగిన ఆధారాలు చూపించిందని.. గోవా ఎన్నికలకు డబ్బు ఇచ్చినట్లు అప్రూవర్ చెప్పారని హైకోర్టు స్పష్టం చేసింది. తమ ముందు ఉంచిన ఫైల్స్, మెటీరియల్‌ని బట్టి చూస్తే.. 'మాండేట్ ఆఫ్ లా'ను ఇఅ అనుసరించిందని స్పష్టమవుతుందని తెలిపింది. ముఖ్యమంత్రికి ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం ఉండదని జస్టిస్ స్వర్ణకాంత శర్మతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. దీంతో.. కేజ్రీవాల్ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. ఈమేరకు.. సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసినట్లు కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వివేక్ జైన్ తెలిపారు. తన అరెస్ట్‌పై హైకోర్టు చేసిన వ్యాఖ్యలె కూడా ఆ పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదిలావుండగా.. కేజ్రీవాల్ ఆరెస్ట్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తమ నేతని ఎదుర్కొనే ధైర్యం లేకే ఇలా అరెస్ట్ చేయించారంటూ ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. తాజాగా ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఢిల్లీ ముఖ్యమంత్రిని జైల్లో ఉంచాలని కోరుకుంటోంది. రెండు రోజుల క్రితం కేజ్రీవాల్ తన లాయర్‌ని కలిశారు. అప్పుడు ఆయన ఓ సందేశం ఇచ్చారు. ఎమ్మెల్యేలంతా తమ ప్రాంతాలకు వెళ్లి, ప్రజల సమస్యలను వినాలని ఆదేశించారు. దీని ఆధారంగా.. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా విచారణ జరిపిస్తున్నారు. కుటుంబ సభ్యులు, న్యాయవాదుల్ని కలవకుండా అడ్డుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పుకొచ్చారు.

**కేజ్రీవాల్‌ను తొలగించాలన్న పిటిషన్‌పై కోర్టు ఆగ్రహం**

మద్యం కేసులో అరెస్టైన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదేం జేమ్స్ బాండ్ సీక్వెల్ కాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలంటూ ఆప్ మాజీ ఎమ్మెల్యే సందీప్‌కుమార్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. రాజ్యాంగం నిర్దేశించిన విధుల్ని నిర్వర్తించలేని పరిస్థితిలో సీఎం ఇప్పుడు ఉన్నారని, జైలు నుంచి ఆయన పనిచేయడం సాధ్యం కాదని పిటిషనర్ పేర్కొన్నారు. ఏ అధికారం ప్రకారం ఆయన కొనసాగుతున్నారో ప్రశ్నించి, పదవి నుంచి తప్పించాలని కోరారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఇప్పటివరకు సుప్రీంకోర్టు కానీ, హైకోర్టు కానీ ముఖ్యమంత్రిని తొలగించిందా..? అలాంటి ఉదాహరణ ఉంటే మాకు చూపించండి. ఈ అంశంపై విచారిస్తోన్న మూడో పిటిషన్ ఇది. సీక్వెల్స్ ఉండటానికి ఇది జేమ్స్‌బాండ్ చిత్రం కాదు. తొలగింపు అంశంపై గవర్నర్ నిర్ణయం తీసుకుంటారు. ఇక్కడ రాజకీయ ప్రసంగాలు చేయకండి. రాజకీయ కుట్రలో మమ్మల్ని ఇరికించకండి. ఈ వ్యవస్థను అపహాస్యం చేయొద్దు. మీపై భారీ జరిమానా విధించనున్నాం" అని మందలించారు. రెండురోజుల క్రితం ఇదే పిటిషన్‌ను జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ విచారించారు. ఇది కేవలం ప్రచారాన్ని ఆశించి వేసినట్లు ఉందని, దానికిగానూ కోర్టు ఖర్చు రూపంలో భారీగా వడ్డించాలని వ్యాఖ్యలు చేశారు. ఇదివరకే ఈ అంశంపై రెండు పిటిషన్లను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారించి, తీర్పు వెలువరించిన తర్వాత దీనిని వేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అదే ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తాజా విచారణ జరిగింది.

## రాధాకిషన్ రావుకు 12 వరకు రిమాండ్

కూడా మార్పిడి చేశారని బాధితుడు పోలీసులకు తెలిపారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు రాధా కిషన్ రావుతో సహా ఇన్ స్పెక్టర్ గట్టుమల్లు, ఎస్ ఐ మల్లికార్జున్ పలువురు పోలీస్ అధికారులపై కేసు నమోదు చేశారు. 2018 నవంబర్ లో తనను టాస్క్ ఫోర్స్ ఆఫీస్ తీసుకువెళ్లి పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించారని వేణుమాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాధా కిషన్ రావు అరెస్ట్ కావడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసానని తెలిపారు. రాధాకిషన్ తో సహా నలుగురు అధికారులపై ఐపీసీ సెక్షన్ 386,365,341, 120(బీ) రెడ్ విత్ 34 సె÷÷-టక్షైన్ల కింద కేసు నమోదు చేసినట్టు తెలుస్తుంది. మరోవైపు రాధా కిషన్ రావుకు ఏప్రిల్ 12వరకు రిమాండ్ పొడిగించింది నాంపల్లి కోర్టు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన ఆయన ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో ఉన్నారు. ఇవాళ్టితో రాధా కిషన్ రావు కస్టడీ ముగియడంతో కోర్టులో హాజరుపరిచారు పోలీసులు. ఈ సందర్భంగా చంచల్ గూడ జైలులో జైలు సూపరింటెండెంట్ ను కలవనివ్వడం లేదని.. లైబ్రరీకి వెళ్లనివ్వడం లేదంటూ మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకోచ్చారు రాధా కిషన్ రావు. సూపరింటెండెంట్ ను కలిసేందుకు అలాగే.. లైబ్రరీకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని మేజిస్ట్రేట్ ఆదేశించింది. అనంతరం రాధా కిషన్ రావును చంచల్ గూడ జైలుకు తరలించారు పోలీసులు.

## కాంగ్రెస్‌ను పడగొట్టాల్సిన అవసరం మాకు లేదు



నాలుకలు అని విమర్శించారు. ఖచ్చితంగా రేవంత్ రెడ్డి కేసులు తప్పించుకోవడం కోసం బీజేపీలో చేరుతారని కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక్క సీటు కూడా రాదన్న రేవంత్ రెడ్డి తాను విసిరిన ఛాలెంజ్ పట్ల సప్పుడు చేయలేదన్నారు. ఈటలకు ఓటు వేసినా ఇక్కడ ఉండరు.. హుజురాబాద్ వెళ్ళిపోతారని విమర్శనాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ తరఫున బరిలో నిలిచిన లోకల్ అభ్యర్థి రాగిడిని గెలిపించాలని కోరారు. రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం.. అంటూ నినాదాలు చేశారు. రాముడి పేరు చెప్పుకుని రాజకీయం చేసే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్, ప్రధాని మోదీ ఇద్దరూ కలిసి తెలంగాణను ఆగం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

## లాస్య నందిత సోదరికే కంటోన్మెంట్ టిక్కెట్

### నివేదిత పేరును ఖరారు చేసిన కేసీఆర్

సంబంధిత వ్యాధితో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. 2023 నవంబరులో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాయన్న కుమార్తె లాస్య నందితకు కేసీఆర్ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో లాస్య నందిత విజయం సాధించారు. కానీ, ఎన్నికల ఫలితాలు విడుదలైన మూడు నెలల వ్యవధిలోనే లాస్య నందిత ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.



# రంజాన్ ప్రార్థన సందర్భంగా ఆంక్షలు

### ట్రాఫిక్ డైవర్షన్ చేపట్టిన పోలీసులు

హైదరాబాద్,ఏప్రిల్10 (ప్రజా మంటలు): ఈద్ ఉల్ ఫితర్ రంజాన్ పండగ సందర్భంగా మీరాలంమండి ఈద్గా, మాసబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రంజాన్ పండుగ ప్రత్యేక నమాజు దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని తెలిపారు. పురానాపూల్, కామాటిపురా, కిషన్‌బాగ్ వైపు నుంచి ఈద్గా వైపునకు వచ్చే వాహనాలను బహదూర్‌పురా క్రాస్‌రోడ్స్ దాటి అనుమతిం చరు. ప్రార్థనలకు వచ్చే వారి వాహనాలను జూపార్క్ ఓపెన్ ప్లేస్‌లో పార్కింగ్ చేసుకోవాలి. శివరాంపల్లి, దానమ్మహట్స్ వైపునకు వచ్చే వాహనాలను దానమ్మహట్స్ క్రాస్‌రోడ్స్ వైపు నుంచి ముందుకు వెళ్లనివ్వరు. వీరికి మోడరన్ సా మిల్, మీరాలం ఫిల్టర్ బెడ్, సూఫీ కార్స్ వద్ద పార్కింగ్ స్థలం కేటాయించారు. కాలాపత్తర్ వైపు నుంచి వచ్చే వాహనాలను మోచీ కాలనీ, బహదూర్‌పురా, శంషీర్‌గంజ్, నవాబ్ సాహెబ్‌కుంట వైపునకు పంపుతారు. ప్రార్థనలకు వచ్చే వారికి భయ్యా పార్కింగ్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో స్థలం కేటాయించారు. పురానాపూల్ నుంచి బహదూర్‌పురా వైపునకు వెళ్లే బస్సులను జియాగూడ వైపునకు మళ్లిస్తారు. మాసబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో ప్రార్థనలు జరగనున్న సందర్భంగా ఉదయం 8నుంచి 11.30 గంటల వరకు మాసబ్‌ట్యాంక్÷÷-ల ఓవర్ కింద నుంచి వాహనాలను అనుమతించరు.

# అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం

**భారత రాజ్యాంగం భగవద్గీత**

**అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా కాంగ్రెస్ మానిఫెస్టో**

**సమాజాన్ని కుల మతాల పేరిట చీల్చడమే బిజెపి మేనిఫెస్టో**

**నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09 (ప్రజామంటలు):**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ లో క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని ఇందిరా భవన్ లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారు చేసి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షుడు-విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్, కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పూజ చేశారు.అనంతరం విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని, ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే సంవత్సరంలో సంవృద్ధి వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నీటితో కళకళలాడాలని, పంటలు పండాలని, రైతులు క్షేమంగా ఉండాలని, శుభం జరుగాలని కోరారు. నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీ గా గెలిచానని, ప్రజా తీర్పు కు అనుగుణంగా, జగిత్యాల ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమని అన్నారు. జగిత్యాల ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని, ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిచ్చింది. మంత్రి గా అవకాశం లభించినప్పుడు మూడు నెలల్లో పల్లెల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాను.విద్యుత్ సమస్య తలెత్తకుండా జగిత్యాల లో సుమారు 20 33/11 కేవీ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసిన.ఎమ్మెల్యేగా మంత్రిగా జే ఎన్ టీ యు ఇంజినీరింగ్ కలశాల, వ్యవసాయ కళాశాల, న్యాక్ శిక్షణ కేంద్రం, ఐటి ఐ కలశాల, శాతవాహన యూనివర్సిటీ, ఏర్పాటు చేశామన్నారు.2004-2009 ముఖ్యమంత్రి సహాయ నిధిని ఉమ్మడి రాష్ట్రంలో అధికశాతం జగిత్యాల ప్రజలకు అందించామని గుర్తు చేశారు. ప్రశ్నించే గొంతుక గా 317



జీ ఓ, మధ్యాహ్న భోజన నిర్వహకుల సమస్య,పాల్ ఉత్పత్తిదారుల సమస్యలు ప్రశ్నించిన.గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ పై ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదు. తుమ్మడి హెట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే ఒక్క ఎత్తిపోతల తో నీరు ఎల్లంపల్లి చేరేది.రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది.4000 మెగా వాట్ల విద్యుత్ పొందే అవకాశం ఉండగా, ఆనాటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. భగీరథ తో 40 వేల కోట్లు, యాదాద్రి తో 40 వేల కోట్లు, కాళేశ్వరంతో లక్ష కోట్లు భారం రాష్ట్రం పై పడింది. ప్రజలు మార్పు కోరి, కాంగ్రెస్ కు పట్టం కట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి ఆడబిడ్డకు గ్యాస్ సిలిండర్ 500 లకు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. యూ పీ ఏ పాలనలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలు చేసినం. మోడీ పాలనలో ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేలా 72000 కోట్ల నుండి 60000 కోట్లకు తగ్గించారు. మోడీ కి మద్దతు ధర పట్ల చిత్తశుద్ధి లేదు. నిరుద్యోగ యువత కు ఏడాదికి 2 కోట్లు చొప్పున భర్తీ పట్ల చిత్తశుద్ధి లేదు. ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి, అమ్మకానికి పెడుతున్నారు.బిజెపి గెలిస్తే, రిజర్వేషన్లు కనుమరుగు అయ్యే ప్రమాదం పొంచి ఉంది. కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీ లు అన్ని వర్గాలకు న్యాయం చేసెందుకు మేనిఫెస్టో, కాంగ్రెస్ మానిఫెస్టో హిందూ వ్యతిరేకం అని కిషన్ రెడ్డి పేర్కొనడం హాస్యాస్పదం, విమర్శలు సహేతుకంగా ఉండాలి. కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించలనడం హిందూ వ్యతిరేకమా, 75 శాతం బలహీన వర్గాలు హిందువులు.కూలీలకు ఉపాధి కల్పించడం హిందూ వ్యతిరేకమా అని ప్రశ్నించారు. రిజర్వేషన్ కోసం కుల గణన చేపట్టడం హిందూ వ్యతిరేకమా, సమాజాన్ని కుల, మతాల పేరిట చీల్చేవిధంగా మాట్లాడుతున్నారు. మా మేనిఫెస్టో కన్న మెరుగైన రీతిలో ప్రకటనలు చేయండి. చౌదరీ చరణ సింగ్ కు భారత రత్న, స్వామీ నాథన్ కు భారత రత్న ఇవ్వటమే కాదు వారి ఆలోచన విధానం అమలు చేయాలి. సమాజాన్ని చీల్చడమే బిజెపి మానిఫెస్టో.కాంగ్రెస్ అన్ని వర్గాలను కలిపి ఉంచడమే కాంగ్రెస్ మేనిఫెస్టో. దళితులు, బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ సడలించి, పెంచాలన్నదే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో.హిందువులు, అల్పాసంఖ్యాక వర్గాల కాంగ్రెస్ కు రెండు కళ్ళ. దేశ ప్రధానిగా పాకిస్థాన్ మెడలు వంచడం దేశ భక్తి కాదా అని నిలదీశారు.దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలు అర్పించింది ఇందిరా గాంధీ. మొన్నటి వరకు మోడీ 400 సీట్లు అన్నారు. ఇప్పుడు 350 సీట్లు గెలుస్తాం అంటున్నారు. వారానికి 50 చొప్పున సీట్లు తగ్గుతున్నాయని అన్నారు.రాష్ట్రంలో బీ అర్ ఎస్ లా ఎన్నికల్లో మోడీ చతికిల పడుతారని జోస్యం చెప్పారు.రాహుల్ గాంధీ దేశం కోసం ఉద్యమిస్తున్నారు. జగిత్యాల నియోజక వర్గ ప్రజలకు సేవలు అందించేందుకు నిజామాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం ఎంపీగా పోటీ చేస్తున్నా అన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత జగిత్యాలను కొడుకుగా అభివృద్ధి చేస్తా. ఎంపీ గా గెలిస్తే తెలంగాణ రాష్ట్ర హక్కులు పరిరక్షకుడిగా రాష్ట్రానికి కేంద్రానికి పనిచేస్తా. నిజామాబాద్ లో సైతం జగిత్యాల ప్రజల ఆదరణ లభిస్తుంది. ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ సోదరులు అండగా నిలుస్తున్నారని, మీడియా హక్కులను కాపాడడం కోసం అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెసు పార్టీ గెలుపే లక్ష్యంగా పాటుపడాలి

**ఎన్.ఎస్.యూ.ఐ. ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న జీవన్ రెడ్డి**

**జగిత్యాల ఏప్రిల్ 09 (ప్రజామంటలు):**
కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ,ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. జగిత్యాలలో ఎన్ ఎస్ యూ ఐ ఆవిర్భావ వేడుకలు నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిజామాబాదు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ ఎస్ యూ ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరాభవన్ లో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు చెట్టే భార్గవ్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారం తీసుకువచ్చే దిశగా కార్యకర్తలు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి -దేవేందర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ ఛైర్మెన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్, టీపీసీసీ ప్రచార కమిటీ మెంబర్ రఘువీర్ గౌడ్, గొల్లపెల్లి మండల అధ్యక్షులు మాజీ సర్పంచి ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేష్, యూత్ నాయకులు రాగుల ప్రదీప్, డబ్బు నిఖిల్, కిషోర్, మహిపాల్, ముల్లె శీను తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ వేయుటకు సమావేశం



**ఎల్కతుర్తి ఏప్రిల్ 09 (ప్రజామంటలు):**
ఎల్కతుర్తి మహనీయుల ఉత్సవ కమిటీ వేయుటకు గాను సమావేశం జరిగినది ఈ సమావేశం ఏప్రిల్ 11 న ఎల్కతుర్తి మండల కేంద్రంలో గల అంబేద్కర్ కూడలిలో సమావేశం కమిటీ వేయుటకు నిర్ణయించడం జరిగినది. మండలంలోని. మాజీ సర్పంచులు ప్రజాప్రతినిధులు ప్రజా సంఘాల నాయకులు కుల సంఘాల నాయకులు. అంబేద్కర్ వాదులు అందరూ హాజరు కావాలి మా మనవి. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల చేరాలు, ఎమ్మార్పీఎస్ రాష్ట్రపోలిటి బ్యూరో సభ్యులు వెంకన్న మాదిగ, దళిత రత్న అవార్డు గ్రహీత రేణిగుంట్ల సాంబయ్య, గడ్డం సంజీవ్, అడ్వకేట్ అంబేద్కర్ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు అంబాల ఆనంద్, ఎల్కతుర్తి అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు ఆర్యన్ రాజ్, పాక రమేష్, అంబాల స్వామి, అంబేద్కర్ సంఘం నాయకులు మర్రి విజయ్, గడ్డం రాజనర్స్, మారుపాక అరుణ్, మారుపాక రవీందర్, అన్ని రాజకీయ పార్టీ ఇలా నాయకులు పాల్గొనవలసిందిగా మహనీయుల జయంతి ఉత్సవాల ఎల్కతుర్తి మండల. కమిటీ చైర్మన్ గొర్రె మహేందర్ కోరారు.


# తీహార్ జైలు నుంచి కవిత నాలుగు పేజీల లేఖ

**'నేను బాధితురాలిని.. నాకు న్యాయం కావాలి' అన్న ఎమ్మెల్సీ కవిత**

**మంగళవారం 4 పేజీల లేఖ విడుదల**

**తనపై తప్పుడు కేసు పెట్టారని ఆరోపణ**

**ఎలాంటి ఆర్థిక లబ్ది పొందలేదంటూ వివరణ**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09 (ప్రజామంటలు):**
ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాంతో తనకు ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. 'నేను బాధితురాలిని.. నా అరెస్టు అక్రమం.. నాకు న్యాయం కావాలి' అంటూ తీహార్ జైలు నుంచి ఆమె రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తికి మంగళవారం ఓ లేఖ రాశారు. నాలుగు పేజీల ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆరోపిస్తున్నట్లు తనకు ఎలాంటి ఆర్థిక లబ్ది చేకూరలేదని కవిత స్పష్టం చేశారు. రాజకీయంగా తనను దెబ్బతీయడానికి, తన రాజకీయ ప్రతిష్ఠను దిగజార్చేందుకు జరిగిన కుట్రలో భాగంగా పెట్టిన కేసు అని లేఖలో పేర్కొన్నారు. తప్పుడు కేసు పెట్టి తనను అరెస్టు చేశారని ఆరోపించిన కవిత.. గడిచిన రెండున్నర సంవత్సరాలుగా ఈ కేసులో ఈడీ, సీబీఐ దర్యాప్తు చేస్తున్నాయని చెప్పారు.దర్యాప్తు సంస్థలకు తాను పూర్తిగా సహకరించానని వివరించారు.పిలిచినప్పుడు వెళ్లి అధికారుల ప్రశ్నలు అన్నింటికీ జవాబిచ్చినట్లు కవిత తెలిపారు. అధికారులు ఆరోపిస్తున్నట్లుగా తనకు ఎలాంటి ఆర్థికపరమైన లాభం చేకూరలేదని, ఈ కేసులో తానే బాధితురాలినని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు దర్యాప్తు మొత్తం మీడియా ట్రయల్స్ గా మారాయని, మీడియాలో సోషల్ మీడియాలో తన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రచారం జరుగుతోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు.

**బీజేపీలో చేరితే ఈ కేసు విచారణ ఆగిపోతుంది.**
'టీవీ ఛానల్స్ నా ఫోన్ నెంబర్ చూపించాయి. దీంతో నా ప్రైవసీకి భంగం కలిగింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు నాలుగు సార్లు విచారణకు హాజరయ్యా.అధికారులు అడగడంతో బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చా. నా మొబైల్ ఫోన్లను కూడా అందించి విచారణకు పూర్తిగా సహకరించా. కానీ, అధికారులు మాత్రం నాపై తప్పుడు ఆరోపణలు చేశారు. మొబైల్ ఫోన్లను ధ్వంసం చేశానని ఆరోపించారు. రాజకీయంగా నా పరపతిని దెబ్బతీయడమే ఈ కేసు వెనక ఉన్న ఉద్దేశమని స్పష్టంగా తెలిసిపోతూనే ఉంది. ఇదొక్కటే కాదు.. ఈడీ, సీబీఐ సహా కేంద్ర దర్యాప్తు సంస్థలు నమోదు చేసిన కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయి. బీజేపీలో చేరితే ఈ కేసుల విచారణ ఆగిపోతుంది. మళ్లీ వాటి ఊసే వినిపించదు. సాక్షాత్తూ పార్లమెంట్ లోనే బీజేపీ నేతలు ప్రతిపక్ష ఎంపీలను బెదిరించారు. నోర్మూసుకుంటారా లేక ఈడీని పంపించాలా అంటూ హెచ్చరించారు.లిక్కర్ స్కాం కేసులో దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తా. ఈ కేసులో బెయిల్ నాకు ఇవ్వాలని కోరుతున్నా' అంటూ కవిత తన లేఖలో న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

### "ఉగాది" పండుగ శుభాకాంక్షలతో...



యుగానికి ఆది ఉగాది
చైత్ర శుద్ధ పాడ్యమి రోజు ఉగాది
నక్షత్రాల గమనానికి ఆది ఉగాది
గ్రహాల గతులు తెలుసుకునే
ఘనమైన పండుగ ఉగాది

నూతన పనులకు ఆరంభం
ఉగాది
నూతన ఆశయాల మేల్కొలుపు ఉగాది
వసంత ఋతువుల ఆగమానం ఉగాది
కాయ పూతల కొత్త సృష్టి ఉగాది

తరువు శాఖలు చిగురు వేస్తే ఉగాది
పక్షుల కిల కిల రాగాల తో మారు మోగే ఉగాది
హిందువుల శ్రేష్టమైన పండుగ ఉగాది
రైతులను గౌరవించే వేడుక ఉగాది

సుఖ దుఃఖాల సమభావం ఉగాది
షడ్ రుచుల పచ్చడి ప్రసాదం ఉగాది
ఆదాయ వ్యయాలు అందిపుచ్చుకునే ఉగాది
రాజ్యపూజ్యం, అవమానం ల పరిశీలన ఉగాది
పంచాంగ శ్రవణ పఠన ప్రారంభం ఉగాది


రచన : అంబాల శివనాథ్ గౌడ్,
పెంబర్తి 9959157898

## కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 09 (ప్రజా మంటలు):**
ధర్మపురి పట్టణం కు చెందిన పవర్ లిఫ్టర్ విరంచి స్వప్నిక గతంలో పలు పోటీల్లో గెలుపొంది సుమారు 45 మెడల్స్ సాధించి వచ్చే నెల 5 వ తేదీన హాంకాంగ్ లో జరగనున్న పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననుండగా వారికి ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనబట్ల దినేష్, ఇందారపు కిరణ్, వారి మిత్ర బృందం ఆద్వర్యంలో 2 లక్షల రూపాయలు అదే విధంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తరపున 50 వేల రూపాయలతో కలిపి మొత్తం 2లక్షల 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని స్వప్నికకు అందజేశారు. అంతక ముందు ఉగాది సందర్భంగా ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ విరంచి స్వప్నిక హాంకాంగ్ లో జరగనున్న పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని, హాంకాంగ్ లో జరగనున్న పోటీల్లో స్వప్నిక పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని సంగనబట్ల దినేష్, ఇందారపు కిరణ్ వారి మిత్రబృందం తరపున 2 లక్షల రూపాయల సహాయాన్ని స్వప్నికకు అందజేసినందుకు చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ప్రభుత్వం నుండి కూడా స్వప్నికకు అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ధర్మపురి నియోజకవర్గ క్రీడాకారులను ప్రోత్సహించెందుకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగనబట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింహ రాజు ప్రసాద్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాందెని మొగిలి,జక్కు రవి, ఎన్.ఎస్.యూ.ఐ. అసెంబ్లీ అధ్యక్షులు అప్పం శ్రావణ్, టౌన్ యూత్ అధ్యక్షులు అప్పం తిరుపతి, వొజ్జల లక్ష్మణ్, సుముక్, అశెట్టి శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## స్వయంభూ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న జువ్వాడి కృష్ణారావు



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 09 (ప్రజామంటలు):**
ఇబ్రహీంపట్నం మండలం వర్ష కొండ గ్రామంలో ఉగాది పర్వదినంగా స్వయంభూ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవంలో మన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు గారిని పూర్ణకుంభంతో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు ఎంపీటీసీ సభ్యులు స్వాగతం పలకడం జరిగినది. తర్వాత వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఎంపిటిసి పొనకంటి చిన్న వెంకట్, మరియు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దూదిగామ్ గంగాధర్, బీసీ సెల్ మండల అధ్యక్షులు బూస రాజేశ్వర్, మరియు వర్షకొండ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరేపల్లి సాయన్న బంటు భూమన్న, ఆరేపల్లి గంగాధర్, బాయ్ రాజిరెడ్డి, గొర్రె శెట్టి గంగారం, మరియు బొల్లువైన శంకర్, జంగా విజయ్, సల్వాల ప్రశాంత్, మరియు బోరిగం రాజు, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ జలేష్, రెబ్బటి రాజశేఖర్, శంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖాజీపేట దర్గా పిఠాధిపతి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా ను కలిసిన కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డా. కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి



**వేలేర్ ఏప్రిల్ 09 (ప్రజామంటలు):**
హనుమకొండ జిల్లా కాజిపేట్ మండలం లోని రంజాన్ మాసం సందర్భంగా ఖాజీపేట దర్గా పిఠాధిపతి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా ని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య దంపతులు, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య కి మద్దత్తు ఇవ్వాలని కోరారు.

# పడకేసిన ప్రభుత్వ ఆసుపత్రి

**అందుబాటులో ఉండని వైద్యులు, అందని వైద్యం - నిధులు ఉన్నా నిరుపయోగంగా సౌకర్యాలు**
**నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని డిమాండ్ - షేక్ సాబిర్ అలీ సామాజిక కార్యకర్త**

**జమ్మికుంట ఏప్రిల్ 09 (ప్రజామంటలు):**
జమ్మికుంట ప్రభుత్వ 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రోగులకు అదనపు సౌకర్యాల దృష్య గతంలో ఆధునికరించటం జరిగింది. ఈ ఆసుపత్రికి చుట్టూ ప్రక్కల గ్రామాల నుండి నిత్యం అత్యవసర మరియు దీర్ఘకాలిక మరియు డయాగ్నస్టిక్ మరియు ప్రసూతి సంబంధిత వైద్యం విషయమై వందలాది మంది రోగులు వారి బంధువులు వస్తుంటారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం మరియు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ పూర్తిస్థాయి వైద్య సేవలు, సౌకర్యాలు అందుబాటులో లేక రోగులు మరియు వారి బంధువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేందుకు వైద్యులకు స్టాఫ్ క్వార్టర్స్ అందుబాటులో ఉన్న కూడా విధుల్లో ఉండి కూడా వైద్యులు అందుబాటులో లేని కారణంగా సకాలంలో వైద్యం అందక రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసిన దుస్థితి. మరీ ముఖ్యంగా మార్చురి నిర్వహణ సరిగా లేక పోస్టుమార్టం కోసం సైతం ఆసుపత్రి డ్రెస్సింగ్ సిబ్బంది మరియు అటెండర్ లపై ఆధారపడాల్సిన దుస్థితి. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సరైన మానిటరింగ్ సిస్టం లేక ఆసుపత్రికి వెచ్చించాల్సిన నిధులలో సైతం అక్రమాలు జరుగుతున్నాయని తెలియుచున్నది. ఇట్టి విషయాలపై ప్రభుత్వ పెద్దలు ఉన్నతాధికారులచే క్షేత్ర స్థాయిలో విచారణ జరిపిస్తూ బాధ్యులపై శాఖపరమైన చర్యలతో పాటు ఆసుపత్రిని అప్గ్రేడ్ చేస్తూ ఆసుపత్రి యందు రోగులకు వారి బంధువులకు పూర్తిస్థాయి సేవలను కల్పించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. లేని పక్షంలో ఆసుపత్రి అభ్యున్నతి మరియు రోగుల అవసరముల దృష్ట్యా రిలే దీక్షల ద్వారా సమస్యల సాకారానికీ ఉద్యమిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం.



# మోడీ గ్యారెంటీ అంటే జైలుకు పంపడమేనా!

మోడీ గ్యారెంటీ అంటే...విపక్ష నేతలను జైళ్లకు పంపించడమేనని బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు సత్యదూరం కాదు. జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, కేజ్రీవాల్ అరెస్ట్ తరవాత విపక్షాల్లో కొంత భయం వచ్చింది. అయితే తప్పులు చేయనిదే ఇడి, సిబిఐ ఏమీ చేయలేవని తెలుసుకోవాలి. అలాగే చట్టాలకు తాము అతీతం అన్న భ్రమలను పాలకులు వీడాలి. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ విషయంలో ఇదే వ్యాఖ్య చేసింది. సిఎం అయినంత మాత్రాన అవినీతి కేసుల్లో తప్పించుకోలేరని, అందిరిలాగే సిఎంకు కూడా చట్టం వర్తిస్తుందని తెలిపింది. అవినీతి చర్యలకు పాల్పడే వారు ఎంతటి ఉన్నతస్థానంలో ఉన్నా శిక్షకు గురి కావాల్సిందే. జగన్, కెసిఆర్ విషయంలోనూ అవినీతి కేసులను తవ్వి తీయాల్సిందే. అలాగే విపక్షాలు కూడా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అప్పులు చేసి, ఆస్తులు కూడబెట్టామని ప్రగల్భాలు పలుకుతున్నాయి. వేలకోట్ల అక్రమంగా సంపాదించి వ్యక్తిగత ఖజానాను నింపుకుంటున్నాయి. తమ ముందున్న అన్ని మార్గాలను ఇందుకు వేదికగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాయి. ఇందకు ప్రత్యక్ష ఉదాహరణ తెలుగు రాష్ట్రాలని చెప్పవచ్చు. తెలంగాణను లూటీచేసి, అప్పుల పాలు చేసిన కెసిఆర్ అధికారం కోల్పోవచ్చు గాక..చేసిన నష్టం పూడ్చడ మెలా అన్నది కూడా ముఖ్యమే. ఎపిలో ఇంతకంటే దారునమైన పరిస్థితితులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రాంతీలయ పార్టీల నేతలు చేస్తున్న అక్రమాలను నిలదీసేదెవరన్నదే ముఖ్యం. నిలదీయడమే కాదు.. అప్పులను ఎలా కడతారు..ఎవరు కడతారన్నది కూడా ముఖ్యమే. అధికారం అనుభవించి, అప్పులు చేసిన వారు జవాబుదారీ తనం లేకుండా పోతే ఎలా? ఇకపోతే ప్రతిపక్షాలను వెంటాడే ముందు అధికార పక్షంలో అవినీతి జలగలను కూడా వదిలించాలి. అప్పుడే మోడీ చర్యల నిజాయితీ తెలుస్తుంది. ప్రతిపక్షం లేని ప్రజాస్వామ్య వ్యవస్థను సృష్టించడం సాధ్యం కాదు. తెలంగాణలో కెసిఆర్ కూడా ఇలాగే చేసి దెబ్బ తిన్నారు. విపక్ష కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను అణగదొక్కితే తమకు తిరుగులేదని భావించారు. కాంగ్రెస్ ముక్త భారత్ కోసం మోడీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం వేయని ఎత్తులు లేవు. ఆర్థికంగా ప్రతిపక్షం పీకనొక్కడం ద్వారా కాంగ్రెస్ ముక్త్ భారత్' అన్న మోడీ 'కల' నెరవేర్చు కునేందుకు పన్నాగం పన్నుతూనే ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రూపాయి పుట్టకుండా చేశారు. ఖాతాలను స్తంభింప చేశారు. దేశంలో అధికార పక్ష నేతల నుంచి కార్పొరేట్ సంస్థల అధి నేతల వరకు ఎంతో మంది పన్నుఎగవేత దారులున్నారు. అంతెందుకు నిన్నగాక మొన్న నీరవ్ మోడీ ఆస్తులు వేలానికి లండన్ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇలా పన్నులు ఎగవేస్తున్న నేతల చిట్టా తీయాలి. మన దేశానికి చెల్లించాల్సిన పన్ను బకాయి లెంతగా ఎగవేశారన్నది కూడ ఆపారిపోయిన వారి విషయంలో లెక్కలు వేయాలి. దేశం వదిలి పారిపోయిన విజయ్ మాల్యా లాంటి వారిని ఎందుకు ఇంక ఉపేక్షిస్తున్నామో తెలుసుకోవాలి. కార్పొరేట్ కంపెనీటలకు పన్నులు మాఫీ చేయడం వంటి చర్యలు సహించరానదిగా భావించాలి. అలాంటి వారిని వదిలేసి దేశంలో అనేకులపైన దాడులు చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు జరిమానాలు విధిస్తూ, నోటీసులు మీద నోటీసులు జారీ చేయడం దేనికి సంకేతం? అంటే..మమతా బెనర్జీ చెప్పినట్లుగా విపక్షాలను బొక్కలో తోయమడే తమ లక్ష్యమని నిరూపించుకుం టున్నాని అనుకోవాలి. 370 సీట్లు గ్యారంటీ అంటూ మోడీ లెక్కలు వేయడం వెనకా ఈ కుట్ర దాగివుందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మొత్తంమీద కాంగ్రెస్‌కు సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను స్తంభింప చేసింది. ఎన్నికలు జరగనున్న సమయంలో ఇలా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాలు జప్తు చేయడం అంటే ఆ పార్టీని ఆర్థికంగా నిస్తేజం చేయడమే. అంటే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ నాయకుల పర్యటన కోసం కనీసం రైలు టికెట్లు కొనే స్థితిలో కూడా లేకుండా చేయాలని మోడీ ప్రభుత్వం కుట్రగా ఉందిన రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు గమనార్హం. లెక్కలు చూపడంలో కాం గ్రెస్ అలస్యం చేసిన మాట వాస్తవం. అయితే పద్దతి ప్రకారం, చట్టం ప్రకారం కాగ్రెస్‌పై చర్యలు తీసుకుని ఉంటే విమర్శలు రావు. 2017-18 నాటి లెక్కలు చూపనందుకు కూడా కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేశారని రాహుల్ తెలిపారు. నిజానికి రాజకీయ పార్టీలు ఆదాయం పన్ను లెక్కలు కరెక్ట్‌గా చూపాలి. లెక్కలు ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పొరపాటు చేసిందనే అనుకున్నా బ్యాంకు ఖాతాలు జప్తు చేయించడానికి ఎన్నుకున్న సమయం ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత తీవ్రమైన చర్య తీసుకోవడం వెనక విపక్షాలను ఎన్నికల సమయంలో ఆర్థికంగా దెబ్బచేయాలన్న కుట్ర దాగి ఉందను కోవడానికన్నా మించిన కారణం ఏమీ కనిపించడం లేదు. ప్రజాస్వామ్యం గొంతునొక్కడానికే తమ బ్యాంకు ఖాతాలు జప్తు చేశారని కాంగ్రెస్ ఆక్రోశించింది. కాంగ్రెస్ విషయంలోనో, వామపక్షాలపైనో ఈ దుర్నీతికి పాల్పడిందని సరిపెట్టుకోవడానికి వీల్లేదు. తప్పు చేసిన వారిని శిక్షించండంలో వెనకాడవద్దు. ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారందరూ తీవ్రంగా పట్టించు కోవలసిన అంశమిది. ఎన్నికల బాండ్లలో బీజేపీ బండారం బయట పడిన వెనువెంటనే కేంద్రం కాంగ్రెస్‌పై ఆదాయ పన్నుశాఖ ను ఉసిగొల్పిందన్న విమర్శలూ ఉన్నాయి. ఎన్నికల ముంగిట లెక్కా పత్రం,హద్దూ పద్దూ లేని జరి మానాలు విధించి ప్రతిపక్షాలను ఎన్నికల ప్రచారం కూడా చేసుకో నీయకుండా ముందే ముందరి కాళ్లకు బంధాలు వేస్తోంది. మరో వైపు జార్ఖండ్ సీఎం సోరెన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌లను అరెస్టు చేయడం,ఇతరులను దర్యాప్తుల పేరుతో వేధించడం, ఇదంతా గమనిస్తే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కమలదళం వేస్తున్న ఎత్తుగడలుగా భావించాలి. చట్టం అందరికీ ఒకేలా ఉండాలి. అందరినీ ఒకేలా చూడాలి. అధికార, విపక్షం అన్న విభేదాలు అస్సలు రాకూడదు. అవినీతి విషయంలో కూడా అందరినీ ఒకే గాటన కట్టాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం మనగులుగుంది.

## ఆశయసాధన



మానవత్వం మృగ్యమై
దానవత్వం ప్రజ్వలిస్తూ
స్వార్థానికి నిలయమై
నిప్పుకే చెదలు పడుతున్న
నేటి సమాజానికి
సౌభాగ్యాలనొసంగ,
పచ్చని పావడా ధరించిన
వాసంత లక్ష్మి
చిరునవ్వులు చిందిస్తూ,
నవ్యరాగాలనాలపిస్తూ,
ముత్తెపు దోసిలితో
వయ్యారంగా ఏతెంచె
"క్రోధి" అనే క్రొంగొత్త పేరుతో,
జనజీవన హానికారకాలను
దునుమాడాలన్న దృఢసంకల్పంతో.

ఈ నూతన వత్సరంలో
ఎద కోరిన సుందర చిత్రపటాన్ని
ఆవిష్కరించగ,
ఆమని సొగసులతో పులకించిపోతున్న
పుంస్కోకిలల రాగాల నాస్వాదిస్తూ,
మధురమైన భావాలను
నెమరేసుకుంటూ,
మోడువారిన శిశిరాన్ని చిగురింపచేసే
మధుమాసంలా,
స్వార్థచింతనతో
ధర్మచింతన కోల్పోతున్న వారిలోని
అహంకార,వికారాలను పారద్రోలుటకు,
వారిపై మానవత్వపు మల్లెల
సుగంధాల జల్లులు కురిపించి
తద్వారా వారిలో పరివర్తనతెచ్చి,
సమాజాభ్యున్నతికి పాటుపడేలా
ప్రేరేపిద్దాం,
వాసంతలక్ష్మి ఆశయసాధనకు
చేయూతనందిద్దాం.

వేమూరి శ్రీనివాస్
తాడేపల్లిగూడెం ,
9912128967

## 15 16వ వార్డులో శక్తి వందన్ అభియాన్ కార్యక్రమం

జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజా మంటలు)

శక్తి వందన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని 15వ మరియు16వ వార్డులో మహిళా సమైక్య గ్రూప్ సభ్యులతో కలిసి కేంద్ర ప్రభుత్వం మరియు నరేంద్ర మోడీ అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు గురించి వివరించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా . బోగ శ్రావణి ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత,పుష్ప రెడ్డి,మధురిమ, సోమ లక్ష్మీ,కవిత, పురెళ్ళ ప్రశాంత్,జున్ను సంతోష్ మరియు మహిళ సంఘ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజా మంటలు)

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తండ్రి 13వ రోజు కార్యక్రమంలో భాగంగా దివంగత హన్మంత రావు చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. తండ్రి మరణంతో శోకతప్తులైన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను, వారి కుటుంబ సభ్యులను బి అర్ ఎస్ అధినేత కేసీఆర్ మరియు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్,మాజి మంత్రులు హరీష్ రావు,ప్రశాంత్ రెడ్డి,మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి,జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్,జిల్లా పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు,ఎమ్మెల్యే లు డా.సంజయ్,మేడిపల్లి సత్యం,బి అర్ ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజీ రెడ్డి గోవర్ధన్,ఎమ్మెల్సీ భాను ప్రసాద్,మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్,మాజీ మంత్రి రాజేశం గౌడ్,టెస్కాబ్ చైర్మెన్ రవీందర్ రావు,బిజెపి నాయకులు రవీందర్ రెడ్డి,మాజీ మేయర్ రవీందర్ సింగ్,బి అర్ ఎస్ పార్టీ నాయకులు,వివిధ హోదాల్లో ప్రముఖులు, అధికారులు, ప్రజలు, పరామర్శించారు,








### కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

## ఎన్నికలు ఎందుకు ?



విశాల్ చాలా కోపంగా "అమ్మ చూడు, వాళ్ళు ఎప్పుడూ ఇంతే నేను చెప్పింది ఏరోజూ వినరు, వద్దన్న పని పనికట్టుకుని మరీ చేస్తారు"అంటూ చెప్పబోతున్నాడు."సరే లేరా నువ్వు ముందు వెళ్ళి కాళ్ళు కడుక్కుని రా , మసాలా బోరుగులు తింటూ మాట్లాడు కుందాం " అన్నది అమ్మ.

సరే అంటూ చెప్పిన పని చెప్పినట్లు చేశాడు విశాల్.

ఇంతలో బయటనుండి వచ్చారు నాన్న , బాబాయి. అందరినీ ఇక్కడి రమ్మని చెప్పారు విశాల్ కి, పరుగున

వెళ్ళి తాతయ్యను, అక్క ను పిలుచుకు వచ్చాడు.

"రేపటి వరుసగా మూడు రోజులు సెలవు కదా అందరం కలసి ఎక్కడికైనా వెళ్దాం చెప్పండి "అన్నారు.

వెంటనే ఊటి అన్నాడు విశాల్, కాదు అరుణాచలం వెళ్ళి గిరి ప్రదక్షణం చేద్దాం అంది అక్క, దురాబారం ఏం వద్దు లేరా అందరం మన సొంత ఊరికి వెళ్లి అక్కడ పొలాల మధ్యన గడుపుదాం అన్నారు తాతయ్య.

అందరి మాటలు విన్న నాన్న "అయితే సరే అందరూ చెప్పింది విన్నాక , మనం పల్లెకు వెళ్ళి చాలా రోజులు అయింది, కాబట్టి అక్కడి వెళ్ళి వద్దాం " అంటూ అందరినీ రేపటికి కావలసినవి సర్దుకొమ్మని చెప్పి వెళ్ళిపోయారు.

"అమ్మ చూసావా ఈ రోజు పాఠశాలలో ఏం జరిగిందో మన ఇంట్లోనూ అదే జరిగింది "అని గతాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

అసలు ఏం జరిగింది చెప్పు అంది అమ్మ.

మేము అందరం కలసి ఒక తరగతి నాయకుణ్ణి ఎన్నుకున్నాం. అతను ఏదైనా పని చేయాల్సి వస్తే అందరినీ అడిగి చెప్పినవన్నీ విని ఎక్కువ మంది ఏం చెబితే అదే చేస్తాడు.ఇప్పుడు కూడా ఇక్కడ అదే జరిగింది పల్లెకు పోవడం నీకు ,నాన్నకు, తాతయ్యకు, బాబాయికి ఇష్టం అందుకే ఎక్కువ మంది ఏం కొరుకున్నరో అదే జరుగుతోంది " అన్నాడు.

"నువ్వన్నది అక్షరాలా సత్యం ఎప్పుడైనా నాయకుడు అన్ని విని , అందులో ఎక్కువ మంది అభిప్రాయం సరైనది అయితే అదే పాటిస్తారు" అన్నది అమ్మ.

"అందుకు వెంటనే నాయకులు లేకపోతే ఏమౌతుంది. అసలు ఎన్నికలు ఎందుకు?" అంటూ పెద్ద పెద్ద పనికొచ్చే ప్రశ్నలలోకు వెళ్ళిపోయాడు విశాల్.

"నాయకుడు లేకపోతే ఒక్కొక్కరు ఒక్కో కోరిక కోరుతారు, స్వార్థం పెరిగి ఘర్షణలకు దారి తీస్తుంది . ఎవరికి వారే తమ మాట నెగ్గాలని అందరి మంచి కోరే పనులు తగ్గిపోతాయి , కాబట్టి తప్పక ఎన్నికల ద్వారా నాయకుణ్ణి ఎన్నుకోవాలి. ఇక నువ్వు అడిగిన మరో ప్రశ్న ఎన్నికలు ఎందుకు అని కదా, ఎన్నికలు ప్రజాస్వామ్యానికి వెన్నెముక , ఎన్నికలు అంటే 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అందరూ స్వేచ్ఛగా ఒక మంచి నాయకుణ్ణి ఎన్నుకోవడానికి ఏకైక మార్గం ఎన్నికలు. మనదేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం నీకు తెలుసా ?" అంది అమ్మ.

అన్ని బాగా అర్థం చేసుకున్న విశాల్ ఎన్నికల పై గౌరవం పెరిగింది. తమ పాఠశాలలో ఎన్నికల సంఘం వారు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో చక్కగా మాట్లాడి మంచి బహుమతి కూడా తెచ్చుకున్నాడు.

-సింగంపల్లి శేష సాయి కుమార్
రాజంపేట, అన్నమయ్య జిల్లా.

## ఈద్-ఉల్-ఫితర్ - సమానత్వానికి ప్రతీక

రామ కిష్టయ్య సంగన భట్ల...
9449595494

**ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ సంపూర్ణంగా అవతరించిన మాసం రంజాన్. రంజాన్ మాసంను ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారు..**

నెలవంకతో ప్రారంభమైన రంజాన్ మాసం.. మళ్లీ నెలవంక రాకతోనే ముగుస్తుంది. రంజాన్ ముగింపులో భాగంగా 'ఈద్ ఉల్ ఫితర్' పండుగను నిర్వహిస్తారు. రంజాన్ నెలలో 29 లేదా 30వ రోజు ఆకాశంలో చంద్ర దర్శనం చేసుకుంటారు. మరుసటి రోజు ఈద్ జరుపు కుంటారు. నిజానికి ఈ రోజు 10 నెల షవ్వాల్ కు మొదటి రోజు. షవ్వాల్ నెలలో మొదటి రోజైన ఈద్-ఉల్-ఫితర్ నాడు ముస్లింలు ఉపవాసం చేయకూడ దనేది ఆచారం.

ఇస్లామీయ దేశాలలో, ముస్లింల సముదాయాలలో అవలంబింప బడుతున్న కేలండర్ చంద్ర మాసాలపై ఆధారంగా గలది. దీన్ని 'తఖ్వీమ్-హిజ్రి-ఖమరి' అని కూడా అంటారు. ఈ కేలండర్ లో 12 చంద్ర మాసాలు, దాదాపు 354 దినాలు గలవు.

హిజ్రీ శకానికి మూలం ముహమ్మద్ ప్రవక్త సంబంధిత హిజ్రా, హిజ్రాహ్ లేదా హిజ్రత్. మహమ్మదు ప్రవక్త , ఆయన అనుయాయులు మక్కా నుండి మదీనా కు క్రీ.శ. 622 లో వలస వెళ్ళారు. ఈ వలస వెళ్ళడాన్నే హిజ్రత్ అని అంటారు.

క్రీ. శ. 622. సెప్టెంబరు లో మహమ్మదు ప్రవక్త తమ అనుయాయులతో కలసి హిజ్రత్ (వలస) 'యస్రిబ్' నగరాన్ని చేరు కొన్నట్లు చెపుతారు. యస్రిబ్ నగరానికి మదీనా లేదా "మదీనతున్ - నబీ" లేదా నబీ (ప్రవక్త) యొక్క నగరంగా పేరు స్థిర పడింది. అలా ముస్లింల శకం హిజ్రీ ప్రారంభ మయినట్లు, ఉమర్ కాలంలో 638లో ఇస్లామీయ కేలండర్ ప్రారంభమయినట్లు చెపుతారు.

మహమ్మదు ప్రవక్త వలస . క్రీ. శ.622 సెప్టెంబరు 9 నాడు మక్కానగరం లోని తమ ఇంటిని వదిలి, మక్కాకు దగ్గరలోని తూర్ గుహలో మూడు రోజులు గడిపి,

622న సెప్టెంబరు 23న

మక్కా పొలిమేరలు దాటి, యస్రిబ్ ప్రాంతానికి పయనమైనారు. సెప్టెంబరు 20న మదీనా దగ్గరలోని "ఖుబా" ప్రాంతానికి చేరుకున్నారు ....24 సెప్టెంబరు 34న ఖుబా నుండి మదీనా ప్రయాణం సాగించి, శుక్రవారపు ప్రార్థనలు జరిపారు. 622 అక్టోబరు 4న మదీనా మొదటి దర్శనం జరిగినట్లు తెలుస్తోంది.

హిజ్రీ ప్రారంభం మొహర్రం నెలలో కాకుండా, ఇస్లామీయ కేలండరు లోని మూడవనెల అయిన రబీఉల్ అవ్వల్ నెలలో హిజ్రత్ జరిగింది. అంటే హిజ్రీ శకం, హి.శ. 1 లోని మూడవ నెల అయిన రబీఉల్ అవ్వల్ 22 వ తేదీన ప్రారంభం అవుతుంది. ఇస్లాం క్యాలెండర్‌లోని హిజ్రీ నెల స్థానిక చంద్రోదయంపై ఆధారపడి వుండడంతో మతపెద్దలు నెలవంక కనిపించగానే ఈద్ ఉల్ ఫితర్ ప్రకటిస్తారు.




ఈద్ అసలు పేరు ఈద్-ఉల్-ఫితర్. ఫితర్ లేదా ఫిత్రా పదానికి అర్థం... మానవునిలో గల ప్రాకృతిక ధర్మం ప్రాతిపదికగా తనతో పాటు ఇతరులకూ సంతోషాన్నివ్వడం. ఈ ధర్మం ప్రకారం భాగ్యము లేని పేద వారికి, ధన రూపేణా భాగ్యము కల్పించడం. ఈ ఫిత్రా రంజాన్ పండుగ సందర్భంగా, పేదలకు, అభాగ్యులకు ఇచ్చే దానం. ప్రతి ముస్లిం ఇవ్వవలసిన కనీస దానం. ఈ దానం, రంజాన్ పండుగకు మూడు రోజుల ముందు నుండి ఇవ్వవచ్చును. అలా ఇచ్చినపుడు, పేదలూ సంతోషంగా పండుగ చేసుకునే వాతావరణం ఏర్పడుతుంది. దేవుడి పట్ల కృతజ్ఞతగా ... పేదలకు దానం చేసే ఈవిధానంలో గోధుమలు గానీ , ఆహార ధాన్యాలను గానీ, ధనాన్ని గానీ పంచిపెడతారు. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేస్తారు.

చంద్ర దర్శనానంతరం చిన్నవారు, పెద్దలకు నమస్కరిస్తారు, శుభాశీస్సులు పొందుతారు. పండుగ రోజున సాధారణంగా ఈద్ ముబారక్, ఈద్ సద్ అని శుభాకాంక్షలు ఒకరికొకరు చెప్పుకుంటారు.

ఈద్ నాడు స్నానానంతరం నూతన వస్త్రాలను ధరిస్తారు. పురుషులు మసీదుకు, ఈద్గాహకు వెళ్ళి, చిన్న పెద్ద, ధనిక పేద, తరతమ భేదాలు లేక వరుసలో నిలబడి నమాజు పఠిస్తారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపు కుంటారు. ఇళ్ళలో పాయసం తదితర పిండి వంటలు భుజిస్తారు. స్నేహితులకు, బంధువులకు కట్న కానుకలను సమర్పించు కుంటారు. పేదలకు దానాలు చేసారు. రంజాన్ నెలలో చేసే దానాలను 'జకాత్' అంటారు.

రంజాన్ మాసం భక్తి శ్రద్ధలకు, పవిత్రతకు, నియమాలకు ప్రతీక. ఏకాగ్రతతో ఆత్మసాక్షాత్కారార్థమై, పాపములు తొలుగుటకు, లౌకిక విషయాలను పక్కనపెట్టి, పారమార్థిక విషయాలపై దృష్టి సాధించేందుకు కఠోర నియమాలను పాటించాల్సి ఉంటుంది. రంజాన్ సందర్భంగా నెలరోజుల పాటు ఉపవాస దీక్ష తో పాటు, నియమిత వేళలో భుజిస్తూ దీక్షను స్వీకరించేవారు దైవ భక్తి, ఆత్మ సంయమనంతో పాటు, ఆరోగ్య వంతులుగా ఉండగలరనేది నిర్వివాదాంశం.

పవిత్ర మాసంలో ఉపవాసాలు, దీక్షలు, ఆధ్యాత్మిక చింతన, దానాలు, ధర్మాలు చేపడుతూ, నెల రోజులు దీక్షా దక్షులు అయిన ముస్లిం సోదరులు పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపు కునేందుకు ఉద్యుక్తులు అవుతున్నారు.



జగిత్యాల పట్టణంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలో నిత్య జనగణమన మిత్రబృందం వారి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, బూరెల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

## క్రమశిక్షణతో కూడిన చదువుతో చక్కటి భవిష్యత్

కృష్ణవేణి గ్రూప్ చైర్మన్ సంగని రాజు - ఘనంగా కృష్ణవేణి స్కూల్ వార్షికోత్సవం




**సికింద్రాబాద్ ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ తో కూడిన చదువు భవిష్యత్ ను బంగారు మయం చేస్తుందని, కృష్ణవేణి టాలెంట్ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సంగని రాజు అన్నారు. పద్మారావునగర్ లోని స్వరాజ్య ప్రెస్ ఆడిటోరియంలో భోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరగ్గా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ...తాము సాదారణ ఫీజులతోనే కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామన్నారు. 6నుంచి 10 వ తరగతుల వరకు ఐఐటీ, జేఈఈ కోచింగ్ ఇస్తున్నామన్నారు. గత ఏడాది టెన్త్ క్లాస్ లో అత్యధిక మార్కులు సాధించిన టాపర్లకు ఈసందర్బంగా సత్కరించి, మెమెంటోలు, బహుమతులను అందచేశారు. తమ చక్కటి విద్యాభోదనను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం బన్సీలాల్ పేట ప్రాంతంలోనే తమ స్కూల్ ను బెస్ట్ అవెలేబుల్ స్కూల్ గా సెలెక్ట్ చేయడం సంతోషంగా ఉందని స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు అన్నారు. విద్యార్థి, విధ్యార్థినులు ప్రదర్శించిన కల్చరల్ ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. తమకు సహకరిస్తున్న స్టూడెంట్స్ ప్యారెంట్స్, టీచర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ జోనల్ ఇంచార్జీ బుచ్చిరెడ్డి, సీఓఓ రంజిత్ కుమార్, పేరేంట్స్, టీచర్లు పాల్గొన్నారు.



ప్రముఖ న్యూస్ ఛానల్ టి.వి. 5 న్యూస్, హిందూ ధర్మం ఛానళ్ల ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగంను జగిత్యాలలో ఆవిష్కరించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణి.

## రెడ్డి జన సంక్షేమ సంఘం, జగిత్యాల ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం



**జగిత్యాల ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** రెడ్డి జన సంక్షేమ సంఘం జగిత్యాల ఆధ్వర్యంలో క్రోదినామ సంవత్సర ఉగాది ఉత్సవం 2024 జరపడం జరిగింది. రెడ్డి కన్వెన్షన్ హాల్లో పంచాంగ శ్రవణం మరియు ఉగాది పచ్చడి, బూరెలు వితరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గారు పాల్గొని ప్రజలందరికీ మంచి జరగలని, రెడ్డి సోదరసోదరిమణులు అందరికి తెలుగు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి జన సంకేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ శైలేందేర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముస్కు రాంగోపాల్ రెడ్డి, కోశాధికారి కన్నవేణి మల్లారెడ్డి సంఘ పెద్దలు ముదుగంటి జనార్దన్ రెడ్డి, బండ భాస్కర్ రెడ్డి, అన్నేడి మనోహర్ రెడ్డి, యెన్నం నర్సింహారెడ్డి, పిడుగు ప్రభాకర్ రెడ్డి, కటిపెల్లి గంగా రెడ్డి, కడపటి రమేష్ రెడ్డి, సంత గౌతంరెడ్డి, క్యాతం గంగారెడ్డి, కొప్పెర వెంకటరెడ్డి, కొంగరి చిన్నారెడ్డి, ముస్కు దామోదర్ రెడ్డి, కోడిపెల్లి పురుషోత్తం రెడ్డి, పొన్నాల త్రిలోచన్ రెడ్డి, ముస్కు యెల్లారెడ్డి, డబ్బా లక్ష్మ రెడ్డి, పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి, కొయ్యడి రవీందర్ రెడ్డి , గుర్రాల గంగా రెడ్డి, అల్ల అమర్నాథ్ రెడ్డి, సంది శ్రీనివాస్ రెడ్డి, బేతి కృష్ణ రెడ్డి, గుర్రాల రఘుపతి రెడ్డి, పడిగెల రాజేందర్ రెడ్డి మరియు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ యుఐ 54 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మహాదేవపూర్ ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ కేంద్రంలో ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు పుప్పిరెడ్డి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ యుఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శ్రీపాద చౌక్ వద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడు రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో ఎన్. ఎస్. యు. ఐ ది కీలకపాత్ర అని తెలిపారు అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు మాట్లాడుతూ...మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వాలకు చెప్పుకోడానికి ఒక సంస్థ ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంస్థగా ఎన్ఎస్యుఐ 9-4-1971లో స్థాపించారు అని అన్నారు ఆ రోజు నుండి ఎన్ఎస్ యు.ఐ లో విద్యార్థులు చాలా పటిష్టంగా పనిచేస్తున్నారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీ యింబర్స్ మెంట్, స్కాలర్ షిప్లు, మధ్యాహ్నం భోజనం ఈ విధంగా అనేక కార్యక్రమాలు విద్యార్థులకు అందించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ అరుణ శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ-2 ఆకుతోట సుధాకర్, మైనార్టీ మండల ప్రెసిడెంట్ ఎజాస్, యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ నయీమొద్దీన్, మాజీ ఉప సర్పంచ్ షాహిన్ ఖాన్, సీనియర్ నాయకులు కోట సమ్మయ్య, మోతె సాంబయ్య, కదార్ల నాగరాజు, ఐత తిరుపతి రెడ్డి, దేవేందర్ రెడ్డి, మొహమ్మద్ లడ్డు, ఎన్ఎస్యుఐ విభాగం విద్యార్థులు రేవంత్, శ్రీకాంత్, సాయి రెడ్డి, మణికంఠ, హర్షిత్, కేశవ్, శ్రవణ్, రాజు, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయానికి సమాధి కడుతున్నదేవరూ?

**పార్లమెంట్లో పదేళ్లుగా పెట్టని బీసీ బిల్లు**

**బీసీలను అన్ని రంగాల్లో విస్మరిస్తున్న పాలకులు**

**బీసీ ఓట్ బ్యాంకు ప్రదానంగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారం**

**నేడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి**

**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** సామాజిక సంస్కర్తల దార్శనికుడు,సామాజిక న్యాయ పితామహుడు ,బలహీన వర్గాల చైతన్య స్పూర్తి దాత మహాత్మా జ్యోతిరావు పూలే.సామాజిక సమానత్వం,మహిళా సాధికారత,విద్యను పెంపొందించడం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. 19 వ శతాబ్దంలో జ్యోతిభా పూలే ప్రారంభించిన అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం అనే మహోన్నత ఆశయాన్ని 20 వ శతాబ్దంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సైతం స్పూర్తిగా తీసుకొని కొనసాగించారు. చట్టపరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యాలు లేకుండా ప్రజలందరికీ సామాజిక న్యాయం హక్కులు దక్కాలని పూలే జీవితాంతం పరితపించారు. మహనీయుల జయంతి,వర్ధంతి రోజుల్లో బీసీల హక్కుల గురించి పోటీలు పడుతూ ఉపాన్యాసాలు ఇచ్చే ప్రజాప్రతినిధులు బీసీల డిమాండ్ల పరిష్కారం అనే అంశంపై బీసీ వర్గాలు నిర్విరామంగా తమ గొంతులను వినిపించినా పట్టించుకోకుండా తమ పబ్బం గడుపుకుంటున్నారు.ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలను బుజ్జగిస్తూ ,బీసీ లను విస్మరిస్తున్నారని,బీసీ లకు సామాజిక న్యాయం దక్కేదెన్నడూ అంటూ బీసీ సంఘాల జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. వివక్ష లేకుండా సమ న్యాయాన్ని చాటి చెప్పిన పూలే మహనీయుని జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

**అన్ని రంగాల్లో అన్యాయమే...**

జిల్లాలో అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని టీ బీసీ జేఏసి అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,తదితర బీసీ కుల సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులు బీసీ రుణాలు పొందడానికి పదేళ్లుగా ఎదురుచూస్తున్నారు.స్వయం ఉపాధి ఋణాలు మంజూరుకు ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు బుట్ట దాఖలు అయ్యాయని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.జిల్లాలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య 20 వేలకు పైగానే ఉంది. విదేశీ విద్య రుణాలు బీసీ విద్యార్థులకి అందని ద్రాక్షలే.తాజాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూడా అన్ని పార్టీల్లో అన్యాయమే జరుగుతోంది.విద్యా,ఉద్యోగాల్లో కొల్లగొట్టినట్లు రాజకీయాల్లో కూడా కొల్లగొట్టడం సామాజిక న్యాయం అనిపించుకోదు.



**అతీగతీ లేని బీసీ బిల్లు..**

పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలని దేశ వ్యాప్తంగా బీసీ సంఘాలు జంతర్ మంతర్ వద్ద ధర్నాలు పదేళ్ళుతరబడి చేస్తున్నా స్పందన లేదు.బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని,బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని,మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని,కేంద్రంలో ఓ.బి.సి.లకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని,మండల్ కమిషన్ నివేదికలను అమలు చేయాలని జిల్లాలో టీ బీసీ జేఏసి అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో టీబీసీజేఏసీ తరుచుగా ఉద్యమాలు చేస్తున్నారు .ఇతర బీసీ,కుల సంక్షేమ సంఘాలు సైతం ఉద్యమిస్తున్నాయి.

**బీసీ ల డిమాండ్ల పరిష్కారమే పూలేకు నిజమైన నివాళి**

**హరి ఆశోక్ కుమార్, న్యాయవాది, రాష్ట్ర అధ్యక్షుడు, టీ బీసీ జేఏసి**

సామాజిక వ్యవస్థలో సింహ భాగంగా ఉన్న బీసీల డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నా రాష్ట్రంలో, కేంద్రంలో పదేళ్లుగా పాలకులు పట్టించుకోవడం లేదు.ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఇంటింటి సమగ్ర కుల గణన కోసం రూ.150 కోట్లతో చేయించడానికి,కుల సంఘాలకు ప్రత్యేక కార్పొరేషన్లు నిర్ణయం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం.బీసీ కుల గణన అనంతరం బీసీ సబ్ ప్లాన్ చేస్తామని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. లోకసభ కు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా కేంద్రంలో వచ్చే ఏ ప్రభుత్వమయినా బీసీ లను విస్మరించక పూలే స్పూర్తితో బీసీలకు న్యాయం చేయాలని,అలాగే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం వలె బీసీలకు సైతం అట్రాసిటీ చట్టం వర్తింప జేయాలని,పూలే జయంతి ని బీసీ వర్గాలు వైభవంగా జరుపు కోవడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ సెలవును ప్రకటించాల్సిన బాధ్యత కేంద్ర,,రాష్ట్ర పాలకులదేనని మా బీసీ జేఏసి తరపున సూచిస్తున్నాం.

# అమరవీరుల ఆశయాలను కొనసాగించాలి

**-బిజెపి జాతీయ నేత పోల్సాని మురళీధర్ రావు..**





**జగిత్యాల ఏప్రిల్ 10( ప్రజా మంటలు):** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలర్పించిన జాతీయ అమరవీరుల సిద్ధాంతాలను కొనసాగించాలని బిజెపి జాతీయ నేత, మధ్యప్రదేశ్ ఇంచార్జ్ పోల్సాని మురళీధర్ రావు అన్నారు. బుధవారం రాత్రి 7గంటలకు స్వర్గీయ ముదుగంటి జితేందర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన అమర వీరుల సంస్మరణ సభలో మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 దశకం లో ఎంతోమంది ఏబీవీపీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను నక్సలైట్లు పొట్టన పెట్టుకున్నారన్నారు. విదేశీ సిద్ధాంత భావ జాలంతో, వర్గ శత్రు నిర్మూలన ధ్యేయ మంటూ బూర్జువాలు, భూస్వాములకు వ్యతి రేకంగా పోరాటం చేస్తున్నామని చెప్పుకునే నక్సలైట్లకు టార్గెట్లు గా ఉన్న ఏబీవీపీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఎవ్వరు కూడా భూస్వాములు కారని తెలిపారు. నక్సలైట్ల సిద్ధాంతం దేశ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక సిద్ధాంతమని ఆ సిద్ధాంతాన్ని వ్యతిరేకించినందుకే జాతీయ వాద కార్యకర్తలు నక్సలైట్లకు టార్గెట్లుగా మారారన్నారు. కేవలం దేశ సమైక్యతను సమగ్రతను కాపాడుకోవడం కోసమే అతి చిన్న వయసులో నక్సలైట్ల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 40 మంది వరకు ఉన్నారన్నారు. జగిత్యాల ప్రాంతానికి చెందిన రామన్న, గోపన్న, జితేందర్ రెడ్డి మధుసూదన్ గౌడ్ తదితరులు తాము నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలర్పించారని తెలిపారు. ప్రజాస్వామ్యానికి దేశ సమగ్రతకు నక్సలైట్ సిద్ధాంతం వ్యతిరేకమనే విషయాన్ని దేశ వ్యాప్తంగా ప్రచారం చేయడంలో ఏబీవీపీ ముందు వరసలో ఉందన్నారు. ఆనాడు ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యకర్తలు చేసిన ఉద్యమ ఫలితంగా నక్సలైట్ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగైందన్నారు. సిద్ధాంత పునాదుల మీదనే ఏ సంస్థ అయినా నిలబడుతుందని, సైద్ధాంతిక నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలను ఆయా సంస్థలు తప్పనిసరిగా గుర్తించాలని తెలిపారు. రాబోయే రోజుల్లో అమరవీరుల సంస్మరణ సభలు, సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిగంటి రవీందర్ రెడ్డి, వీర గోపాల్,జిడిగె పురుషోత్తం, రాచకొండ శ్రీరాములు, ఏసిఎస్ రాజు, లింగంపల్లి శంకర్, మురళి, క్యాతం వెంకటరమణ,సంపూర్ణ చారి,మ్యాన మహేష్, సిపెల్లి రవీందర్ పలువురు బిజెపి, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగాది రోజున పంచాంగ శ్రవణం ఎంతో పవిత్రమైనది



**భీమదేవరపల్లి ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** ఉగాది రోజున పంచాంగ శ్రవణం ఎంతో పవిత్రమైనదని, ఉగాది రోజు ఆలయంలో కూర్చుని పంచాంగం వింటే శుభమని సీనియర్ అర్చకులు గుడ్ల అంజయ్య శాస్త్రి అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఆయన మాట్లాడుతూ%™%. క్రోధీ నామ సంవత్సరం ప్రారంభం రోజు తమ రాశిఫలాలు, స్థితిగతులను గురించి తెలుసుకుని అందరూ శాంతులను చేసుకోవడం ద్వారా శుభం అని అన్నారు. పంచాంగ శ్రవణంలో తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ ఫలితాన్ని తెలుసుకోవడం ద్వారా పుణ్యాన్ని పొందుతారని అన్నారు. తెలుగు ప్రజలు ఎంతో పవిత్రంగా జరుపుకునే పండుగల్లో ఉగాది ఒకటని, ఉగాది అంటే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది ఉగాది పచ్చడే అని అన్నారు. తీపి, కారం, ఉప్పు, పులుపు, చేదు, వగరు.. ఈ ఆరు రుచులతో తయారు చేసే ఈ పచ్చడి వెనుక సంప్రదాయంతో పాటు అంతకుమించి ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని అన్నారు. ఈ క్రోధి నామ సంవత్సరములో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు రాంబాబు, సిబ్బంది రవీందర్, సందీప్, శ్రీధర్ గ్రామస్తులు గౌదల సంపత్, సింగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగ సేవా కేంద్రమును ప్రారంభించిన కోటగిరి శ్రీనివాస్

**జగిత్యాల ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలో స్థానిక మేయో హాస్పిటల్ ప్రాంగణంలో సక్ష్యం ఆధ్వర్యంలో దివ్యాంగ సేవా కేంద్రమును ప్రారంభించిన యశస్వి ఎంటర్ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దివ్యాంగ సేవా కేంద్రము జిల్లాలో ఉన్న దివ్యాంగులకు ప్రతిరోజు అందుబాటులో ఉంటుందనీ, ఇట్టి దివ్య కేంద్రంలో దివ్యాంగులకు సంబంధించిన సమస్యలు, సదరం సర్టిఫికెట్స్, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, కృత్రిమ అవయవాలు, రక్తదానము, సెరిబ్రల్ పాలసీ, పుట్టుకతో వచ్చే మానసిక లోపాలు, వినికిడి లోపాలు ఉన్నవారికి అన్నిటికి సంబంధించి మార్గదర్శనం చేయడం తదితర సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సక్షం అధ్యక్షులు డా. తాటిపాముల సురేష్, కార్యదర్శి కూర్మాచలం రఘునందన్, సభ్యులు ఎన్నమనేని అశోక్ రావు, గడ్డం మహిపాల్ రెడ్డి, జిడిగే పురుషోత్తం, జగిత్యాల భవిత సెంటర్ రాజేందర్ , నాగభూషణం, చిత్తారి మధుకర్, గాలిపెల్లి నరసయ్య, వొల్లెం శ్రీనివాస్, బోనగిరి దేవయ్య , ప్రసాదరావు, రాజేషుని హరీష్, కస్తూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.






ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి ని కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్.

## గొల్లపల్లి మార్కండేయ మందిరంలో పంచాంగ శ్రవణం



**గొల్లపల్లి ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రముతో వివిధ గ్రామాల్లో మార్కండేయ మందిరంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది నూతన సంవత్సరం సందర్భంగా మండల కేంద్రం లోని పద్మశాలి సంఘ భవనం లో మార్కండేయ స్వామి పూజల అనంతరం తీపి, కారం, వగరు, ఉప్పు, పులుపు, చేదు వంటి షడ్రుచులతొ చేసిన ఉగాది పచ్చడిని సంఘ సభ్యులకు, ఇతరులకు అందించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు చౌటపల్లి తిరుపతి మాట్లాడుతూ.... నూతన సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ అనందంగా, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపెల్లి మండల పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి అంకం భూమయ్య గొల్లపల్లి పట్టణ అధ్యక్షులు చౌటపల్లి తిరుపతి, ప్రదాన కార్యదర్శి, అందె లక్ష్మన్, కోశాధికారి అంకం లింబాద్రి, ఉపాధ్యక్షులు ఎనగందుల శంకర్, సహాయ కార్యదర్శి అంకం లక్ష్మినారాయణ, గౌరవ అధ్యక్షులు గాజెంగి సత్తయ్య, యువజన సంఘం అధ్యక్షుడు అంకం రవి, గూడూరి రాజన్న, ధర్మపురి మల్లేశం, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు - వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయం**



**కానిపర్తి ఏప్రిల్ 09 (ప్రజామంటలు):** ఉగాది పండుగ ను పురస్కరించుకొని మంగళ వారం కానిపర్తి బస్టాండ్ దగ్గర స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం తోగరి హనుమయ్య తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేయటం జరిగినది. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు. స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలుగొన్న వారు వ్యవస్థాపకులు మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షులు కొత్తూరి ఇంద్రసేన, ప్రదాన కార్యదర్శి నరెడ్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ అధ్యక్షుడు జనగాని సుమన్, ఉపాధ్యక్షులు జనగాని సాంబయ్య, మాదిరెడ్డి సంధ్యారాణి, ఎక్స్ ఎంపిడిఓ హన్మయ్య, కోడిగుటి బాలరాజు, కన్నెబోయిన అశోక్, నరేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గోని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## అనాథలు, నిరాశ్రయుల మధ్యలో ఉగాది వేడుకలు

సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు): పండగను అందరూ కుటుంబ సభ్యులతో, బంధువులతో జరుపుకుంటారు. కానీ పండుగను జరుపుకొని అనాథలు, నిరాశ్రయులు ఎందరో రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్నారు. ఉగాది సందర్భంగా రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న ఆ అభాగ్యులకు ఉగాది పచ్చడి, బక్షాలు, ఆహారం అందించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశాము. ఈ నూతన శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అభాగ్యుల జీవితాలలో మంచి మార్పుతో నూతన జీవితాన్ని పొందాలని స్కై ఫౌండేషన్ ఆశిస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్, ఓ. పావని, సభ్యులు అఖిల్, హరీష్ కుమార్, ఇర్ఫాన్ మొదలగు వాళ్ళు పాల్గొన్నారు.

## పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వం విప్




జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన మాజి ఎంపీటీసీ కాసారపు రాయలింగగౌడ్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్-ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం రోజున వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రంగధాములపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త శ్రీనివాస్ ని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విప్ వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు బీమా సంతోష్, రేవల్ల సత్య నారాయణ గౌడ్, చిర్ర గంగాధర్, కాస గంగాధర్, కాసారపు అరవింద్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, జెల్ల అనిల్ యాదవ్, నేరెళ్ల మహేష్, సత్యనారాయణ రెడ్డి, చిట్యాల శ్రీకాంత్, యూత్ మండల ఉపాధ్యక్షులు ఒర్సు విజయ్, విక్రమ్ రెడ్డి, కంది వెంకటేష్ తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ సీఎం కేసీఆర్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10 (ప్రజామంటలు): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులను మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించినారు.ఎమ్మెల్యే తండ్రి హనుమంతరావు చిత్రపటానికి మాజీ సీఎం కెసిఆర్ పూలమాల వేసి నివాళులర్పించినారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత తదితరులు పాల్గొన్నారు.

## కోమటి కొండాపూరు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి జాతర జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు




ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 10 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కోమటి కొండపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి జాతరకు ముఖ్యఅతిథిగా వచ్చిన జువ్వాడి కృష్ణారావును అర్చకులు వారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం యమాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కల్లెం గంగారెడ్డి కి ఎడమ చేతికి గాయం కావడంతో జువ్వాడి కృష్ణారావు వారిని పరామర్శించారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడా శ్రీకాంత్ రెడ్డి. ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గంగాధర్, ఎంపిటిసిల పోరం అధ్యక్షుడు పొన్నకంటి వెంకట్, ఎంపీటీసీ రాజారెడ్డి. ఎంపీటీసీ జలేష్, బోడిగం రాజు, ఇట్టేడి శ్రీనివాస్, రమేష్, క్యాథమ్ తిరుపతిరెడ్డి, వెంకట్రెడ్డి, రామ్ రాజ్, వెంకట్, రమేష్, ద్యావతి విజయ్. పురుషోత్తం, తదితర నాయకులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



ఇల్లందకుంట ఏప్రిల్ 10 (ప్రజామంటలు): మండల లోని మోత్కూరి రఘువర్దన్ శ్రీ నందిత టీ & టిఫిన్ సెంటర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ది కూమార్, కనుమల్ల సంపత్, మారపల్లి ప్రశాంత్, గుండారపు సాయి కుమార్, మొగిలి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## యమధర్మరాజు కి రుద్రాభిషేకం మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం




జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజామంటలు): భరణి నక్షత్రంను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా దక్షిణ కాశీ ధర్మపురి పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నకు అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు వారి దేవాలయం లో బుధవారం స్వామివారికి రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, అర్చకులు ప్రదీప్ కుమార్, నేరెళ్ల సంతోష్ కుమార్, వొద్దిపర్తి కళ్యాణ్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో డా. కావ్య జన్మదిన వేడుకలు



హనుమకొండ ఏప్రిల్ 10 (ప్రజామంటలు): హనుమకొండ జిల్లా కేంద్రంలోని మానసిక వికలాంగ పిల్లలతో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న డాక్టర్ కడియం కావ్య. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య పుట్టినరోజు వేడుకలు కొలహాలంగా జరిగాయి. హన్మకొండలోని వారి నివాసంలో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం మానసిక వికలాంగ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డాక్టర్ కడియం కావ్య కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా కృష్ణవేణి స్కూల్ వార్షికోత్సవం

**క్రమశిక్షణతో కూడిన చదువుతో చక్కటి భవిష్యత్**

**కృష్ణవేణి గ్రూఫ్ చైర్మన్ సంగని రాజు**




సికింద్రాబాద్, ఏప్రిల్ 10 ( ప్రజామంటలు): చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ తో కూడిన చదువు భవిష్యత్ ను బంగారు మయం చేస్తుందని, కృష్ణవేణి టాలెంట్ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సంగని రాజు అన్నారు. పద్మారావునగర్ లోని స్వరాజ్య ప్రెస్ ఆడిటోరియంలో భోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరగ్గా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...తాము సాదారణ ఫీజులతోనే కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామన్నారు. 6నుంచి 10 వ తరగతుల వరకు ఐఐటీ, జేఈఈ కోచింగ్ ఇస్తున్నామన్నారు. గత ఏడాది టెన్త్ క్లాస్ లో అత్యధిక మార్కులు సాధించిన టాపర్లకు ఈసందర్భంగా సత్కరించి, మెమెంటోలు, బహుమతులను అందచేశారు. తమ చక్కటి విద్యాభోదనను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం బన్సీలాల్ పేట ప్రాంతంలోనే తమ స్కూల్ ను బెస్ట్ అవెలేబుల్ స్కూల్ గా సెలెక్ట్ చేయడం సంతోషంగా ఉందని స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు అన్నారు. విద్యార్థి, విధ్యార్థినులు ప్రదర్శించిన కల్చరల్ ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. తమకు సహకరిస్తున్న స్టూడెంట్స్ ప్యారెంట్స్, టీచర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ జోనల్ ఇంచార్జీ బుచ్చిరెడ్డి, సీఓఓ రంజిత్ కుమార్, పేరేంట్స్, టీచర్లు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో పంచాంగ శ్రవణం



జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కంజర్ల అనంతా చార్యుల వారిచే పంచాంగ పఠనము నిర్వహించారు. సంఘ బాధ్యులు, భక్తులు, సంఘ సభ్యులు, పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పంచాంగ పఠనం చేసిన కంజర్ల అనంతాచార్యులను సత్కరించారు.

## ఈనెల 13న సికింద్రాబాద్ లో 5వ అథ్లెటిక్ ఓపెన్ మీట్

### 55 పైబడిన సిటిజన్స్ కు వివిధ పోటీలు




సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు): ఈనెల 13న సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఆర్.ఆర్.సీ ) గ్రౌండ్ లో మహిళలు, పురుషులకు 5వ అథ్లెటిక్ ఓపెన్ మీట్ ను నిర్వహిస్తున్నట్లు హెల్తీ సీనియర్ సిటిజన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్ ఆర్ భగవాన్, జనరల్ సెక్రటరీ ఎం.ఆర్.పీ బాబు లు తెలిపారు. ఆసక్తి గల వారు ఎంట్రీ ఫీ రూ300 చెల్లించి, మాగ్జిమమ్ 3 ఈవెంట్స్ ల్లో పాల్గొన వచ్చని వారు వివరించారు. 55, 60,65, 70, 75, 80,85, 90, 95, 100 వయస్సు కలిగి ఉన్నవారు వేర్వేరు గ్రూఫ్ ల్లగా విభజించి, 3000 మీటర్ల వాక్, లాంగ్ జంప్స్, ట్రిపుల్ జంప్, డిస్కస్ త్రో, షాట్ ఫుట్, జావెలిన్ త్రో, హామ్మర్ ఈవెంట్స్ లో కాంపిటీషన్స్ జరుగుతాయన్నారు. క్రీడాకారులకు ఫ్రీ డార్మెటరీ అకామడెషన్, టీ షర్ట్, బ్రేక్ ఫాస్ట్, లంచ్ ను అందిస్తామని వారు వివరించారు. పూర్తి వివరాలకు 9290744738 నెంబర్ కు కాల్ చేయవచ్చున్నారు. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చి, విజేతలుగా నిలిచినవారికి మెడల్స్, సర్టిఫికెట్లను అందచేస్తామని భగవాన్, బాబు లు మీడియాకు తెలిపారు. ఈ సీనియర్ సిటిజన్స్ స్పోర్ట్ మీట్ కు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.



జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ తండ్రి మకునూరు హనుమంత రావు సీనియర్ అడ్వకేట్ 13వ రోజు (స్వర్గ పాత్ర ) కార్యక్రమంలో పాల్గొని, సంతాపం వ్యక్తం చేసిన నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి

## నిజామాబాద్ ఎంపీగా సేవ చేసే అవకాశం ఇవ్వండి

**కాంగ్రెస్ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు**

**కాంగ్రెస్ లో చేరిన పలువురు అల్లిపూర్ నాయకులు**

**కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన టి. జీవన్ రెడ్డి**



జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి సమక్షంలో రాయికల్ మండలం అల్లిపుర్ గ్రామానికి చెందిన బీ అర్ ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా అల్లిపూర్ గ్రామం మాజీ వార్డు సభ్యురాలు పోతు ప్రవలిక శ్రీనివాస్, ఒరగంటి రాజవ్వ, బోగ అనిత, పద్మశాలి సంఘం అధ్యక్షుడు సిరిపురం శ్రీహరి, యువజన సంఘం అధ్యక్షుడు బోగ నర్సయ్య, బీడి ప్యాకింగ్ సంఘం అధ్యక్షుడు ఎంబరి రాజన్న, శేఖర్, ప్రభాకర్, ఆనంద్, మహేష్, దాసరి గంగారాం, ఆకుల వేంకటేశ, ఎం బారి హరీష్, ఎం బారి మధు కు జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.... పార్లమెంట్ ఎన్నికల్లో అండగా నిలువాలని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు.అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసే తనకు రాజకీయాలకు అతీతంగా, ప్రజలు ఓటు వేసి, నిజామాబాద్ ఎంపి గా సేవ చేసే అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## చిలకలగూడ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు నేడు రంజాన్ వేడుకలు

సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు): నేడు రంజాన్ సందర్బంగా సికింద్రాబాద్ చిలకలగూడ ఈద్ గా ప్రాంతం లో గురువారం ఉదయం 6 నుంచి మద్యాహ్నం 12 వరకు ట్రాఫిక్ ఆంక్షలు పెట్టినట్లు చిలకలగూడ ఎస్.ఐ పి.కిషోర్ తెలిపారు.చిలకలగూడ ఈద్ గా వద్ద వేలాది మంది ముస్లిం సోదరులు నేడు ఉదయం నుంచి రంజాన్ ప్రత్యేక ప్రార్ధనలు చేయనున్నారు. శివ టీ పాయింట్, వెస్లీ చర్చి లైన్, పద్మారావునగర్ పార్కు నుంచి చిలకలగూడ, సికింద్రాబాద్ కు వెళ్ళే ప్రజలు ఇతర మార్గాల నుంచి వెళ్ళాలని సూచించారు.ఈద్ గా ప్రాంతాల్లోని నివసిస్తున్న ప్రజలు తమ వాహనాలను గురువారం రోజున రోడ్ల పక్కన పార్కింగ్ చేయవద్దన్నారు. ప్రజలు పోలీసులతో సహకరించి, రంజాన్ పర్వదిన వేడుకలను ప్రశాంతంగా జరిగేందుకు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈసందర్బంగా ముస్లిం పెద్దలతో సమావేశమైన పోలీసు అధికారులు రంజాన్ ఏర్పాట్లు, బందోబస్తు, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఐ బీ.అనుదీప్, ఎస్.ఐ పి.కిషోర్, సిబ్బంది, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.




## అయోడిన్ లోపం పై అవగాహన కార్యక్రమం




గొల్లపల్లి ఏప్రిల్ 10 (ప్రజామంటలు): గొల్లపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డా. నరేష్ పర్యవేక్షణలో గోవింద్ పల్లి, గొల్లపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో 6 నుండి 12 సంవత్సరాల మధ్య 90 విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు నిర్వహించినారు. అయోడిన్ లోపం వలన తలెత్తే సమస్యలను పిల్లలకు అవగాహన కల్పించినారు. అయోడిన్ శరీరానికి అందకపోతే థేరాక్సిన్ హార్మోన్ వలన సమతుల్యతో లోపిస్తుంది పిల్లలలో దృష్టిలోపం చలాకితనం ఎదుగుదల లోపిస్తుంది. దీని ద్వారా గర్భిణీలకు అబార్షన్ అయ్యే ప్రమాదం ఉన్నది మరియు మానసిక సమస్యలు తలెత్తుతాయి. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ గట్టు శ్రీధర్, సూపర్ వైజర్ లు నరేందర్, రమేష్, శారద ఎఎన్ఎం రజిత, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క



మంచిర్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు): అన్ని వర్గాలకు మేలు చేసేది కాంగ్రెస్ మాత్రమేనని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలనీ మంత్రులు శ్రీధర్ బాబు,సీతక్క అదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజాలను కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పెద్దపల్లి పార్లమెంటరీ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రినీ చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రతీ పేదవాడికి న్యాయం జరుగుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం లో మోదీ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తా అని మోసం చేశారనీ ఆరోపించారు..జన్ ధన్ ఖాతాల్లో 15 లక్షలు వేస్తామని పేద ప్రజలను మోదీ మోసం చేశారనీ విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ లో సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ, విమానాశ్రయం, రైల్వే లైన్ లు, అడవి బిడ్డల హక్కుల హామీలను బీజేపీ నిలబెట్టుకోలేదన్నారు. సింగరేణి ని ప్రయివేట్ పరం చేసి కార్మికుల హక్కులను కలరాసే చట్టాలకు బిజెపి సర్కార్ శ్రీకారం చుట్టిందన్నారు. ఆధాని, అంబానీ ,తప్ప ఈ దేశ ప్రజలు మోదికి గుర్తు లేరనీ విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు వనరులను ఆస్థులను కట్ట బెట్టే ప్రయత్నాలు చేస్తోంది మోదీ ప్రభుత్వమని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఆధాని, అంబానీ లకు బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు.. బీ.ఆర్.యెస్, బీజేపీ రెండు ప్రభుత్వాలు రైతులను మోసం చేశాయన్నారు..కేసీఆర్ లిక్కర్ స్కామ్, ఫోన్ ట్యాపింగ్ కేసులను పక్కదారి పట్టించేందుకు పొలం బాట పట్టరాని తెలిపారు. నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడిన కేసీఆర్ ఒక్కరోజు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బీఆర్ఎస్ ఒక్క సీటు గెలిచే పరిస్థితి లేదన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాలేదు కరువు ఎట్లా వచ్చిందో కెసిఆర్ చెప్పాలన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కరువు వస్తే కాంగ్రెస్ పై నిందలా అని ప్రశ్నించారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీ ఆర్ యెస్ కు లేదన్నారు. క్వి%శీ%టాలుకు 10 కిలోలు రైతుల నుండి దోపిడీ చేసింది బీ ఆర్ యెస్ కాదా అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతామన్నరు. కేసీఆర్ చేసిన అప్పులు తీర్చడానికి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను దారిలో పెడుతున్నామని అన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందరికి అందజేస్తున్నామని స్పష్టం చేశారు. 5 గ్యారంటీలు అందుతున్న ప్రతీ కుటుంబ%శీ% కాంగ్రెస్ కు ఓటయ్యాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావ్, వినోద్, వివేక్ వెంకటస్వామీ, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

Sad Demise



Vuppala Rajamouli
(06-07-1943 -10-04-2024)

Queitly remembered everyday...
No longer in our life to share, but in our hearts,
dear daddy you're always there.

Husband of Vuppala Varalaxmi

Sons: Baswaraju, Natraj

Daughter in Laws :
Kavitha, Nagarani, Sharada

Daughter: Ramini Sreelatha,
Son in law : Veeresham

Grand children: Sindhuja, Manisha, Abhishek, Revanth,
Abhigna, Dheeraja, Anwitha, Srirag

Contact No : +91 93462 69925

# క్వింటాల్ కు రూ. 500 బోనస్ ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి

## రెండు లక్షల రుణమాఫీ ఏమైంది?
## కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది
## బండి సంజయ్ ఐదేళ్లలో నయాపైసా తేలేదు
## ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే హుస్నాబాద్ కు నవోదయ పాఠశాల తెస్తా
## కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్







**హుస్నాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఆరుగ్యారెంటీ పేరుతో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టిందని అన్నారు.

**రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం:**
రైతులకు త్రాగునీరు, సాగునీరు అందివ్వకుండా, క్వింటాలుకు 500 భోనస్ ఎప్పుడిస్తారో తెలియక, రెండు లక్షల రుణమాఫీ ఏమైంది? రైతు భరోసా ఏదని రైతులు ప్రశ్నిస్తున్నారని అన్నారు.

**4 నెలల్లోనే కాంగ్రెస్ పై ప్రజా వ్యతిరేకత:**
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలయిందని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని అన్నారు. తాను ఎంపీగా ఉన్న ఐదేళ్లలో జాతీయ రహదారులు, రైల్వేలైన్ తెచ్చానని అన్నారు.

**ఐదేళ్లలో బండి సంజయ్ నయాపైసా నిధులు తేలేదు:**
కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రతి ఏటా వచ్చే నిధులను బండి సంజయ్ తెచ్చినట్లు మాట్లాడటం హాస్యాస్పదం అని అన్నారు. ఇంతవరకు కరీంనగర్ లోక్ సభ పరిధిలో బండి సంజయ్ ఏమి పనులు చేశారో తెలపాలని అన్నారు.

**ఎల్లమ్మ చెరువు కట్టపై మార్నింగ్ వాక్ తో ఇంటింటా ప్రచారం:**
హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తో కలిసి మార్నింగ్ వాక్ లో పాల్గొన్నారు. అనంతరం హమాలీ కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

**హుస్నాబాద్ నియోజకవర్గానికి నవోదయ పాఠశాల తెస్తా:**
ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలకు 9 మాత్రమే నవోదయ పాఠశాలలు ఉన్నాయని...ఐదేళ్లలో బండి సంజయ్ ఒక్క నవోదయ పాఠశాల తీసుకురాలేక పోయారని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిస్తే హుస్నాబాద్ కు నవోదయ పాఠశాల తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

**బండి మాట్లాడేవన్నీ తొండి మాటలు:**
కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఐదు రూపాయలు కూడా తీసుకురాలేదని అన్నారు. ఉపాధిహామీ, అంగన్ వాడి, ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలకు బండి సంజయ్ నిధులు తెచ్చానని తొండిగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. బండి సంజయ్ కి ప్రజల మనోభావాలతో ఓట్ల రాజకీయడం చేయడమే తప్పు....అభివృద్ధి చేయడం చేతకాదని అన్నారు.

**కాంగ్రెస్ గ్యారంటీల మీద వెనుకడుగు:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నోటికి వచ్చిన గ్యారెంటీలను ప్రకటించిందని ఇప్పుడు అమలు చేసేందుకు మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తుందని అన్నారు. రైతులకు ఎకరాకు రూ.15000, మహిళలకు రూ.2500, రైతు కూలీలకు రూ.12000, 500 లకు సిలిండర్, ఆసరా పెన్షన్ రూ.4000, రైతు రుణమాఫీ ?2లక్షలు ఏమైందని ప్రశ్నించారు. యాసంగి పంటకు క్వింటాలుకు రూ. 500 ల భోనస్ పై ప్రభుత్వం స్పందించాలని, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం భోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు ఇచ్చుడే కానీ...ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ప్రజల్లో నాలుగు నెలల్లోనే ప్రభుత్వం పై వ్యతిరేకత మొదలయిందని పేర్కొన్నారు. రూ. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు. ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయో ప్రకటన చేయడం లేదన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. గత పదేళ్ళలో ఎన్నడూ చూడని కరువును ఈ సారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే చూస్తున్నరని పేర్కొన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ అనిత, కౌన్సిలర్లు గోవిందు రవి, బొల్లి శ్రీనివాస్, సుప్రజ, గుల్ల రాజు, రవిందర్ రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ సుధాకర్, మాజీ కౌన్సిలర్ సారయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డి, అక్కన్నపేట ఎంపీపీ లక్ష్మిబీలునాయక్, పార్టీ నాయకులు చిట్టి గోపాల్ రెడ్డి, విజయభాస్కర్, అరుణ్ కుమార్, మహిళ అధ్యక్షురాలు బండి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

# లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకై నిరంతర ఉద్యమం
## లష్కర్ జిల్లా సాధన సమితి ప్రెసిడెంట్ గుర్రం పవన్



**సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ప్రత్యేక సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటయ్యే వరకు వివిధ కార్యక్రమాల ద్వారా తమ ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ జిల్లా సిద్ధించాలని కోరుతూ లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సమితి సభ్యులు బుధవారం శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం నుండి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ముందుగా సికింద్రాబాద్ లోని శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే ఈప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలను అందజేసినట్లు వివరించారు. జిల్లా ఏర్పాటయ్యే విధంగా ఆశీర్వదించాలని మహంకాళి అమ్మవారు, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవార్లను మొక్కుకున్నట్లు తెలిపారు. జిల్లా ఏర్పడిన వెంటనే అమ్మవార్లను 1116 టెంకాయలను సమర్పించి మొక్కును తీర్చుకుంటామని తెలిపారు. వచ్చే వారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం నుండి జూబ్లిహిల్స్ పెద్దమ్మ అమ్మవారి ఆలయం వరకు పాదయాత్రను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాధం బాల్ రాజ్ యాదవ్, ఉపాధ్యక్షులు శైలేందర్, బాబురావు, సభ్యులు జగదీష్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, అశోక్, సుధాకర్ రెడ్డి, ముక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టు అంజన్న కు తన మొక్కులు చెల్లించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్.

## ఎండిపోయిన వరి పంటలను పరిశీలించిన బోయినపల్లి వినోద్ కుమార్



**ఎల్కతుర్తి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం గోపాలపురం గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్. హుస్నాబాద్ మాజీ శాసనసభ సభ్యులు వోడితల సతీష్ కుమార్. హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్. లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మొగిలి. కిషన్ రావు. ప్రసాద్. సంపత్ రావు. వీరస్వామి. ల పొలాలను చూసి వినోద్ కుమార్ మాట్లాడుతూ.... బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల పరిపాలనలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని అన్నారు రైతుల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో దేవాదుల ప్రాజెక్టు ద్వారా చెరువులు కుంటలు నింపి ప్రతి ఎకరాకు నీరు అందించేవారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి 200 ఎకరాలు పంట ఎండిపోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల గారడి తోటి అధికారంలోకి వచ్చి మీము అధికారంలోకి వస్తే క్వింటాల్ వరి ధాన్యానికి 500 బోనాస్ ఇస్తామని మాయమాటలు చెప్పి రైతులను నమ్మించిందని అన్నారు . అందరికీ పంట పెట్టుబడి సాయం కూడా అందించలేదని ధ్వజమెత్తారు. మీరు రెండు లక్షల రూపాయలు రుణాలు తీసుకోండి మేము అధికారంలోకి వచ్చిన తర్వాత మాఫీ చేస్తాము అని మాయమాటలు చెప్పి రైతులను మోసం చేసి అధికారంలోకి రావడం జరిగింది అన్నారు అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం రైతులకు సాగు నీరు ఇవ్వలేని దుస్థితి లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు సతీష్ కుమార్ మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు నుండి నీరు తీసుకువచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య విధానమని మండిపడ్డారు. కాంగ్రెస్ ను నమ్మి ప్రజలు ఓటు వేస్తే చివరికి వేసిన వారికి వెన్నుపోటు పొడిచిందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటుంది రైతులు ఎవరు అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్. సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్. రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరీ స్వామి. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు కడారి రాజు. స్థానిక ఎంపిటిసి యశోద రాజేశ్వరరావు. మండల యూత్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి. సోషల్ మీడియా మండల అధ్యక్షులు గుండేటి సతీష్ నేత. సీనియర్ నాయకులు గుండా ప్రతాపరెడ్డి, దేవేందర్రావు, నాగేశ్వర్, రాజు మాధవరావు. రాజేశ్వరరావు. సమ్మయ్య,శివాజీ, మదర్, రాజ్ కుమార్, రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్, యూత్ నాయకులు కృష్ణ సాయి, స్వామి రావు, కార్తీక్, సాంబరాజు, అనిల్ రంజిత్ కుమార్, గణేష్, రైతులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నివాస ప్రాంతంలో కమర్షియల్ కిచెన్ తో ఇబ్బందులు
## జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన అపార్ట్ మెంట్ వాసులు



**సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** బన్సీలాల్ పేట డివిజన్ లోని న్యూ బోయిగూడ నివాస ప్రాంతంలో వెలసిన కమర్షియల్ కిచెన్ తో తాము అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని పేర్కొంటూ బోయిగూడ వై జంక్షన్ లోని ఎం.ఎన్.కే విట్టల్ సెంట్రల్ కోర్టు అపార్ట్ మెంట్ నివాసితులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు తమ ఆవేదనను లేఖ రూపంలో బుధవారం జిల్లా కలెక్టర్, జీహెచ్ఎమ్సీ కమిషనర్, ముఖ్య ఆరోగ్య శాఖాధికారులకు కంప్లైంట్ చేశారు. తమ అపార్ట్ మెంట్ పక్కనే వెలసిన కేటరర్స్ కిచెన్ లో ప్రతి రోజు తెల్లవారు జామున 3 గంటల నుంచి వంట పాత్రల చప్పుళ్ళు, నూనెల పొగలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లతో వస్తున్న నూనె ఆవిరి, వాసనలతో అపార్ట్ మెంట్ లో తాము శ్వాస పీల్చుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డదిడ్డంగా పేర్చిన గ్యాస్ సిలండర్లతో కూడ తమకు ఫైర్ యాక్సిడెంట్ ముప్పు పొంచి ఉందని వారు పేర్కొన్నారు. అనారోగ్యకర పరిస్థితుల్లో అద్దె ఇంట్లో కొనసాగుతున్న సదరు వాణిజ్య వంటశాలలను ప్రజారోగ్యం దృష్ట్యా నివాసిత ప్రాంతం నుంచి మరో చోటికి తరలించాలని స్థానికులు ఆ ఫిర్యాదులో అధికారులను కోరారు.

**హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ రామాయణ ప్రవచనం**



**జగిత్యాల ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** పట్టణములోని బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జగిత్యాల జిల్లా మన గుడి కార్యక్రమంలో భాగంగా శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచన కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రముఖ పురాణ ప్రవచకులు బ్రహ్మశ్రీ పాలెపు చంద్రశేఖర్ శర్మ చే బాలకాండం ప్రవచనం సాయంకాలం 6:00 గంటల నుండి 7:00 గంటల వరకు ప్రవచనం కొనసాగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవచన అనంతరం ప్రసాద వితరణ చేశారు.

## ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** ఉగాది తెలుగు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని బుధవారం భోలక్ పూర్ లోని శ్రీశ్రీ శ్రీ దుర్గాభ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయంలో గంగ తెప్ప, గొలుసు తెంపుట కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకం, పూజ కార్యక్రమాలతో పాటుగా మద్యాహ్నం శ్రీదుర్గా భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు, ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలో ఆశేష భక్త జనసందోహం నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఎదురుగా ఏర్పాటు చేసిన నిప్పులతో కూడిన అగ్ని గుండానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒగ్గు కళాకారులు , అర్చకులు, శివసత్తులు భక్తులు నిప్పుల గుండంలో నడిచి, తమ భక్తిని చాటారు. ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను ఎత్తుకున్న శివసత్తులు డప్పు చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్ళి సమీపంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీరాములు, ఈవో జ్యోతి, నాయకులు నాగలక్ష్మీ, అర్చకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వందలాది మందికి అన్నదానం నిర్వహించారు.

## ముగిసిన గుండు మల్లన్నస్వామి ప్రతిష్టాపన మహోత్సవాలు
## ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్






**గొల్లపల్లి ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం తిరుమలపూర్ (పిడి) గ్రామంలో గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీ గుండు మల్లన్న స్వామి ప్రతిష్టాపన మహోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మల్లన్న స్వామికి బెల్లం పానకంతో చేసి వండిన బోనాలను మహిళలు నెత్తిన ఎత్తుకొని ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. బోనాలతో ఆలయం చుట్టి ప్రదక్షిణాలు చేసి మల్లన్న స్వామికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గర్భగుడిలోని స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు సింహాచలం శ్రీనివాసచార్యుల వేదమంత్రోచ్చారణలతో స్వామివారికి అభిషేకాలు, నిత్య పూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో స్వామివారికి పట్నాలు, అగ్ని గుండాల కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
తిరుమలాపూర్ (పిడి) గ్రామంలోని శ్రీ గుండు మల్లన్న స్వామినీ ప్రభుత్వ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భగుడిలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా వేదపండితులు డాక్టర్ సింహాచలం శ్రీనివసాచార్యుల వేద మంత్రోచ్చారణముల నడుమ ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, మాజీ సర్పంచులు గంగాధర్, సత్యనారాయణగౌడ్, నాయకులు భీమ సంతోష్, క్యాస గంగాధర్, జెల్లా అనిల్ కుమార్, మల్లారెడ్డి, గురజాల బుచ్చిరెడ్డి, నేరెళ్ల మహేష్, మహేందర్, గాదె ఆంజనేయులు, లచ్చయ్య రామస్వామి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ తండ్రి హనుమంతరావు 13వ రోజు స్వర్గ పాత్ర కార్యక్రమంలో పాల్గొని నివాళు లర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, చీఫ్ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం తదితరులు**

## వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు దంపతుల వివాహ మహోత్సవం



**హన్మకొండ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** హనుమకొండ ఐనవోలు మండల కేంద్రం లోని ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారిని ఆలయంలో గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు మల్లేశ్వరి దంపతుల 35వ వివాహ మహోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వరంగల్ పార్లమెంట్ వర్ధన్నపేట నియోజకవర్గం యువజన కాంగ్రెస్ కోఆర్డినేటర్ పోలేపాక అశోక్ ఆధ్వర్యంలో గజమాల మరియు శాలువాతో సత్కరించి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో..... వర్ధన్నపేట నియోజకవర్గం అధికార ప్రతినిధి నిమ్మనేని శేఖర్, మండల అధ్యక్షులు మహేందర్ గౌడ్. కాంటెస్ట్ జెడ్పిటిసి, 55వ డివిజన్ నాయకులు గడ్డం శివరాం, 65వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు శ్రీపతి తిరుపతి, శ్రీపతి అశోక్, గడ్డాల రాకేష్, మండల సతీష్, కోడారి రవి. మరియు.ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అశోక్ నగర్ హన్మాన్ టెంపుల్ లో ఉగాది పంచాంగ శ్రవణం**



సికింద్రాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్దనగర్ డివిజన్ పరిధిలోని పార్సీగుట్ట న్యూ అశోక్ నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా వందలాది మంది భక్తులు స్వామి వార్లను దర్శించుకొని పూజలు చేశారు. అర్బన్ వెల్ఫేర్ డెవలప్ మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయంలో సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ శర్మ క్రోధి నామ సంవత్సర పంచాగాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రెసిడెంట్, బస్తీ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బియ్యం లారీ పట్టివేత



**హుజురాబాద్ ఏప్రిల్ 10 (ప్రజామంటలు):** హుజురాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్ లో గల నాగేంద్ర దాబా సమీపంలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న బియ్యం లారీని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు పట్టుకున్న లారీలో 320 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయి. బియ్యానికి సంబంధించిన ఆధారాలు లారీలో ఉన్న వ్యక్తులు చూపకపోవడంతో పోలీసులు లారీని పోలీస్ స్టేషన్ తరలించారు. పరకాల నుండి గుజరాత్ కు వెళున్న ఈ బియ్యం పిడిఎస్ బియ్యమా..? లేక మరే బియ్యం అనే విషయాన్ని నిర్ధారణ చేయడానికి సివిల్ సప్లై అధికారులను సంప్రదించినట్లు టౌన్ సిఐ బొల్లం రమేష్ తెలిపారు. సివిల్ సప్లై అధికారులు ఇచ్చే నివేదిక ప్రకారం పిడిఎస్ బియ్యం అయితే కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.



# నితీశ్ రెడ్డి సంచలన రికార్డు!

ఆల్‌రౌండర్, తెలుగు ఆటగాడు నితీష్ కుమార్ రెడ్డి సంచలన రికార్డు నమోదు చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో హాఫ్ సెంచరీ, ఓ వికెట్, ఓ క్యాచ్ అందుకున్న తొలి అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. గత 16 సీజన్లలో ఈ ఘనతను ఏ అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ కూడా సాధించలేకపోయాడు. ఐపీఎల్ 2024లో భాగంగా మంగళవారం ముల్లన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నితీష్ ఈ రికార్డు నెలకొల్పాడు. పంజాబ్ కింగ్స్‌పై నితీశ్ రెడ్డి 37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 64 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో మూడు ఓవర్లలో ఓ వికెట్ (జితేష్ శర్మ) పడగొట్టి.. 33 రన్స్ ఇచ్చాడు. ఇక భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో ప్రభసిమ్రాన్ సింగ్ ఇచ్చిన క్యాచ్ అందుకున్నాడు. దాంతో ఐపీఎల్‌లో హాఫ్ సెంచరీ, వికెట్, క్యాచ్ అందుకున్న తొలి అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా నిలిచాడు. అంతేకాదు ఐపీఎల్‌లో హాఫ్ సెంచరీ చేసిన రెండో పిన్న వయస్కుడిగా కూడా నిలిచాడు. 20 ఏళ్ల 319 రోజుల వయసులో నితీశ్ ఫిఫ్టీ చేయగా.. ప్రియం గార్గ్ 19 ఏళ్ల 307 రోజుల వయసులో ఈ ఘనత అందుకున్నాడు.

**స్పిన్నర్లపై ఎటాక్ చేయాలని ముందే అనుకున్నా..**

పంజాబ్ కింగ్స్ పేసర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారని, అందుకే తాను దూకుడగా ఆడేందుకు ఎక్కువగా ప్రయత్నించలేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్, తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి తెలిపాడు. స్పిన్నర్లు వచ్చాక వారిపై ఎటాక్ చేయాలని తాను ముందే అనుకున్నానని చెప్పాడు. దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబాడ బౌలింగ్‌లో తాను సిక్స్ కొట్టడంను ఎప్పటికీ మరిచిపోలేనని నితీశ్ రెడ్డి పేర్కొన్నాడు. ఐపీఎల్ 2024లో భాగంగా మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ గెలవడంతో నితీశ్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. నితీశ్ చెలరేగడంతో 39/3 ఉన్న హైదరాబాద్ స్కోరు చివరికి 182కు చేరుకుంది. పంజాబ్ కింగ్స్‌పై నితీశ్ రెడ్డి 37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 64 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో ఒక వికెట్ కూడా పడగొట్టాడు. మూడు ఓవర్లలో ఓ వికెట్ పడగొట్టి.. 33 రన్స్ ఇచ్చాడు. ఆల్‌రౌండ్ షో చేసిన నితీశ్.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా నితీశ్ రెడ్డి మాట్లాడుతూ%ూ% 'సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడం ఆనందంగా ఉంది. ఈ ప్రదర్శన నాకు పెద్ద బూస్ట్ లాంటిది. ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగా. నాపై నాకు పూర్తి నమ్మకం ఉండాలని నాకు నేనే చెప్పుకున్నా' అని తెలిపాడు. 'పంజాబ్ కింగ్స్ సీమర్లు అద్భుతంగా బౌలింగ్ వేశారు. అందుకే దూకుడగా ఆడేందుకు ఎక్కువగా ప్రయత్నించలేదు. స్పిన్నర్లు వస్తారని నాకు తెలుసు. వారిపై దాడి చేయాలని ముందే అనుకున్నా. ఆ ప్రణాళిక ప్రకారమే ఆడాను. కగిసో రబాడ బౌలింగ్‌లో సిక్స్ కొట్టడం ఎప్పటికీ మరిచిపోలేను. టోర్నీలో పేసర్లు స్లో బౌన్సర్లతో ఇబ్బంది పెడుతున్నారు. వాటిని ఎదుర్కోవడం చాలా కష్టం. నేను బౌలింగ్ చేసేటప్పుడు కూడా ఇలానే బంతులేశా. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఇలానే ఆడాలనుకుంటున్నా. జట్టు కోసం అత్యుత్తమంగా ఆడేందుకు ప్రయత్నిస్తా' అని నితీశ్ రెడ్డి తెలిపాడు.


ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 2 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. నితీశ్ రెడ్డి (64బీ 37 బంతుల్లో 4ఐ4, 5ఐ6) హాఫ్ సెంచరీ చేశాడు. పంజాబ్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/29) నాలుగు వికెట్స్ పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో పంజాబ్ 6 వికెట్లకు 180 పరుగులు చేసింది. శశాంక్ సింగ్ (46 నాటౌట్‌బీ 25 బంతుల్లో 6ఐ4, 1ఐ6), అశుతోష్ శర్మ (33 నాటౌట్‌బీ 15 బంతుల్లో 3ఐ4, 2ఐ6) రాణించారు. భువనేశ్వర్ కుమార్ (2/32), ప్యాట్ కమిన్స్ (1/22) కట్టడి చేశారు.

## సన్‌రైజర్స్ కెప్టెన్‌కు ఓ అభిమాని 'హారతి'



భారతదేశంలో క్రికెట్‌ను ఒక మతంగా పరిగణిస్తారు. అంతేకాకుండా.. క్రికెట్ అభిమానులు తమ అభిమాన క్రికెటర్లను 'దేవుడు'తో పోలుస్తారు. కాగా.. అలాంటి దృశ్యం ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇక నిన్నటి మ్యాచ్‌లో టాస్ సమయంలో సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ మాట్లాడుతుండగా ఓ అభిమాని అతడికి హారతి ఇచ్చాడు. ఈ వీడియోకు బాహుబలిలోని 'దండాలయ్యా' అనే పాటను యాడ్ చేసి 'ఎక్స్' లో షేర్ చేశాడు. దీంతో ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కాగా.. ఈ వీడియోపై స్పందించిన కమిన్స్ 'థ్యాంక్యూ' అంటూ రిప్లై ఇచ్చాడు. పాట్ కమిన్స్‌కి ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్ ఫాలోయింగ్ బాగా పెరిగింది. ఆస్ట్రేలియాను ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజేతగా చేసిన తర్వాత, కంగారూ జట్టును ఆరోసారి వన్డే ప్రపంచకప్ విజేతగా నిలబెట్టాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు పాట్ కమిన్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు.కాగా.. ఐపీఎల్ 2024లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 2 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. ముల్లన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నితీశ్ రెడ్డి (64) ఇన్నింగ్స్‌తో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేయగలిగింది. పాట్ కమిన్స్ నేతృత్వంలోని ఆరెంజ్ ఆర్మీ ఐపీఎల్‌లో మూడో విజయాన్ని నమోదు చేసింది.ఐపీఎల్ 2024 పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఐదో స్థానంలో ఉంది. సన్‌రైజర్స్ ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడింది. అందులో మూడింటిలో గెలువగా.. రెండింటిలో ఓడిపోయింది. కాగా.. ఇప్పటి వరకు ఆడిన అన్ని మ్యాచ్‌లు గెలిచిన ఏకైక జట్టు రాజస్థాన్ రాయల్స్ మాత్రమే. నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

## ఫాస్ట్ బౌలింగ్‌లో 'క్లాసెన్' మెరుపు స్టంపింగ్..



క్రికెట్‌లో స్పిన్నర్ల బౌలింగ్‌లో కీపర్స్ స్టంపింగ్ చేయడం మామూలే. స్పిన్ బౌలింగ్‌లో స్టంప్స్‌కు దగ్గరగా ఉండి.. స్టంపింగ్ చేస్తుంటారు. ఫాస్ట్ బౌలింగ్‌లో స్టంప్స్‌కు దగ్గరగా.. వికెట్ కీపింగ్ చేయడం చాలా అరుదు. అందులోనూ స్టంపింగ్ చేయడం అంటే మామూలు విషయం కాదు. అయితే దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్.. ఫాస్ట్ బౌలింగ్‌లో మెరుపు స్టంపింగ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ 2024లో భాగంగా మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కీపర్ క్లాసెన్ మెరుపు వేగంతో స్టంపింగ్ చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. ఇన్నింగ్స్ ఆరంభంలో స్వింగ్‌తో పంజాబ్ కింగ్స్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. భువీ స్వింగ్‌ను ఎదురుకునేందుకు పంజాబ్ కెప్టెన్ శిఖర్ ధావన్ ఫ్రంట్ ఫుట్‌కు వచ్చి షాట్‌లు ఆడాడు. ఇది గమనించిన సన్‌రైజర్స్ సారథి ప్యాట్ కమ్మిన్స్.. కీపర్ హెన్రిచ్ క్లాసెన్‌ను స్టంప్స్‌కు దగ్గరగా ఉండమని సూచించాడు. ఇన్నింగ్స్ ఐదో ఓవర్ నాలుగో బంతిని భువీ సంధించగా.. గబ్బర్ ఫ్రంట్ ఫుట్‌కు వచ్చి షాట్ ఆడాడు. బంతి బ్యాట్‌కు కనెక్ట్ కాలేదు. గంటకు 140 కిమీ వేగంతో వచ్చిన బంతిని అందుకున్న క్లాసెన్.. మెరుపు వేగంతో స్టంప్స్‌ను పడగొట్టాడు. దీంతో ధావన్ సహా అందరూ షాక్ అయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫాస్ట్ బౌలింగ్‌లో మెరుపు స్టంపింగ్ చేసిన హెన్రిచ్ క్లాసెన్‌పై నెట్టింట ప్రశంసల వర్షం కురుస్తోంది. 'క్లాసెన్.. నువ్ సూపర్', 'ఎంఎస్ ధోనీని గుర్తు చేశావ్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. గతంలో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అప్పుడప్పుడు ఫాస్ట్ బౌలింగ్‌లో స్టంప్స్‌కు దగ్గరగా ఉండి కీపింగ్ చేసేవాడు. భువనేశ్వర్ కుమార్, ప్రవీణ్ కుమార్, మునాఫ్ పటేల్, దీపక్ చహర్ బౌలింగ్ వేసినపుడు మహీ స్టంప్స్‌కు దగ్గరగా ఉండేవాడు. ఇక ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 2 పరుగుల తేడాతో గెలిచింది.

## టీ20 వరల్డ్ కప్ టీమ్‌లో విరాట్‌కు స్థానం సుస్థిరమే

విరాట్ కోహ్లీ అభిమానులకు గుడ్ న్యూస్.. ఐపీఎల్ సీజన్ 17లో టాప్ స్కోరర్‌గా వెలుగొందుతున్న టీమిండియా రన్ మెషిన్‌కి రానున్న టీ20 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కడం ఖాయమని తెలుస్తోంది. సూపర్ ఫామ్‌లో ఉన్న కోహ్లీని ప్రపంచకప్ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐ నిర్ణయించినట్లు సమాచారం. టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలగేందుకు విరాట్ కోహ్లీని ఒప్పించాలని సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్‌కు బీసీసీఐ కార్యదర్శి జే షా సూచించినట్లు గతంలో వచ్చాయి. అయితే ఈ బాధ్యత నుంచి అగార్కర్ వెనక్కి తగ్గారు. దీని తర్వా త, జై షా రోహిత్ శర్మతో ఈ విషయాన్ని లేవనెత్తినట్లు మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ వెల్లడించాడు. అయితే కోహ్లీ టీ20 ప్రపంచకప్ జట్టులో కచ్చితంగా ఉండాలని రోహిత్ శర్మ బీసీసీఐకు గట్టిగా చెప్పినట్లు కీర్తి ఆజాద్ తెలిపారు. దీంతో ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శన ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని బీసీసీఐ సెలక్షన్ కమిటీ భావించింది. అందుకు తగ్గట్టే ఇప్పటివరకు ఐపీఎల్ లో 5 మ్యాచ్‌ల్లో 316 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. తద్వారా ఈ సీజన్ లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. మిగిలిన మ్యాచ్‌ల్లోనూ కోహ్లీ రాణిస్తే ఇక టీ 20 ప్రపంచకప్ లో కోహ్లీ స్థానానికి ఢోకా లేదని తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్‌కు విరాట్ కోహ్లీని ఎంపిక చేయాల్సిన అవసరం బీసీసీఐకి ఎదురైంది. ఎందుకంటే సూపర్ ఫామ్ లో ఉన్న కోహ్లీని ఏ కారణం చేతనైనా జట్టు నుంచి తప్పించలేం. అందువల్ల అతడు టీ20 ప్రపంచకప్‌కు ఎంపిక కావడం ఖాయమని బీసీసీఐ వర్గాలు తెలిపాయని క్రిక్‌బజ్ నివేదించింది. ఈ నేపథ్యంలో జూన్ 1 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్‌కు ఎంపికయ్యే భారత జట్టులో విరాట్ కోహ్లీ కనిపిస్తాడని చెప్పొచ్చు. అలాగే కింగ్ కోహ్లీకి ఇదే చివరి టీ20 ప్రపంచకప్. మరి కోహ్లీ ప్రపంచకప్ గెలుస్తాడో లేదో చూడాలి.

**ప్రపంచకప్‌లో పాల్గొనే టీమ్ ఇండియా ఆటగాళ్ల పేర్లు (అంచనా):**

రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా

## ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి రోహిత్?



ఐపీఎల్ 2024 ప్రారంభం నుంచి ముంబై ఇండియన్స్ జట్టులో జరగకూడదని విషయాలు ఎన్నో జరిగాయి. హార్దిక్ పాండ్యా తిరిగి ఎంఐలో చేరడం.. రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించడం.. జట్టులోని అంతర్గత గొడవలు.. ప్లేయర్లు రెండు విభాగాలుగా విడిపోవడం.. ఇలా ఒకటేమిటి.. చెప్పుకుంటూ పోవాలే గానీ కథలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో మరో ఆసక్తికర చర్చ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఇటీవల లక్నో జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ చేసిన కామెంట్స్.. రోహిత్ శర్మ వచ్చే ఏడాది ఐపీఎల్‌కు ఆ ఫ్రాంచైజీ తరపున ఆడతాడనే దానికి ఊతమిస్తున్నాయ్. ముంబై జట్టును విడిచిపెట్టి ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వెళ్లాలని రోహిత్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక అనూహ్యంగా ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను వచ్చే సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నట్టు సమాచారం. అతడి కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు టాక్. ఆ జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. ఓ ఇంటర్వ్యూలో లక్నో కోచ్ జస్టిన్ లాంగర్‌ను 'ఐపీఎల్ మెగా వేలంలో ఏ ఆటగాడిని మీరు సొంతం చేసుకోగలరు' అని ఇంటర్వ్యూయర్ అడగ్గా.. రోహిత్ శర్మను కచ్చితంగా ముంబై నుంచి ట్రేడ్ చేసుకుంటామని.. నాకు తెలిసి ఈ డీల్ మీరే కుదుర్చగలరని నవ్వుతూ సమాధానమిచ్చాడు లాంగర్.

## ఉత్కంఠ విజయంతో రికార్డులు కొల్లగొట్టిన హైదరాబాద్



ఐపీఎల్ 2024 23వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండు పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. హైదరాబాద్ సాధించిన ఈ ఉత్కంఠ విజయంతో ఎన్నో పెద్ద రికార్డులు ధ్వంసమయ్యాయి. హైదరాబాద్, పంజాబ్ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో ఎన్నో కొత్త రికార్డులు కూడా నమోదయ్యాయి. తొలుత బ్యాటింగ్ చేసిన పాట్ కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. నితీష్ కుమార్ రెడ్డి 37 బంతుల్లో 64 పరుగులు చేశాడు. పంజాబ్‌కు చెందిన అర్ష్‌దీప్ సింగ్ 4 వికెట్లు తీశాడు. 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన పంజాబ్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లకు 180 పరుగులు మాత్రమే చేయగలిగింది. పంజాబ్ తరుపున శశాంక్ సింగ్, అశుతోష్ శర్మ పోరాడినా చివరి బంతి వరకు సాగిన ఈ పోరులో జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. శశాంక్ 25 బంతుల్లో 46 నాటౌట్, అశుతోష్ 15 బంతుల్లో 33 నాటౌట్‌గా నిలిచారు. ఈ మ్యాచ్‌లో సాధించిన రికార్డుల గురించి చెప్పాలంటే, పరుగుల పరంగా ఐపీఎల్ చరిత్రలో పంజాబ్‌కి ఇది నాలుగో అతి స్వల్ప ఓటమిగా నిలిచింది. హైదరాబాద్, పంజాబ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అన్ క్యాప్డ్ ఇండియన్ బ్యాట్స్ మెన్ పరుగులు చేశారు. ఐపీఎల్ చరిత్రలో రెండోసారి, ఒకే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు. ఈ మ్యాచ్‌లో భారత అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు కలిసి మొత్తం 188 పరుగులు చేశారు. 2010లో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అన్‌క్యాప్డ్ ఇండియన్ ప్లేయర్స్ మొత్తం 204 పరుగులు చేశారు. హైదరాబాద్‌లో నితీష్ కుమార్ రెడ్డి 64 పరుగులు, అబ్దుల్ సమద్ 25 పరుగులు, అభిషేక్ శర్మ 16 పరుగులు, పంజాబ్‌లో శశాంక్ సింగ్ నాటౌట్ 46, అశుతోష్ శర్మ నాటౌట్ 33, ప్రభసిమ్రాన్ సింగ్ నాలుగు పరుగులు చేశారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com